విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :149 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శుక్రవారం 16 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

ఢిల్లీలో సీజేపీ నిరసన..

## అడ్డుకోలేమన్న హైకోర్టు



- ఎన్నికల అవకతవకల ఆరోపణలపై సీజేపీ నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతి
- కన్నాట్ ప్లేస్‌లో ఆందోళనను నిలువరించాలన్న పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- సీజేపీ ఆందోళనలో పాల్గొననున్న ఆమ్ ఆద్మీ పార్టీ
- ఇండియా కూటమి సైతం ఇదే అంశంపై పోరాటం



## జగన్‌కు బిగ్‌షాక్

- అక్రమాస్తుల కేసులో రోజువారీ విచారణ షురూ
- జగన్ అక్రమాస్తుల కేసులో ఈడీ పిటిషన్లపై సీబీఐ కోర్టు రోజువారీ విచారణ
- అరబిందో, హెటిరో సంస్థల కేసులో జగన్ డిశ్చార్జ్ పిటిషన్‌పై కోర్టు విచారణ చేపట్టింది.
- ప్రధాన నిందితుడు జగన్ దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌పై ఆయన తరపు న్యాయవాది అశోక్ రెడ్డి వాదనలు

ప్రతి గ్రామాన్ని ఉపాధి కేంద్రంగా మార్చడమే

# ధ్యేయం

- సంక్షేమం నుంచి స్వావలంబన దిశగా.. ఇదే మా విధానం: సీఎం చంద్రబాబు
- విజయవాడలో జాతీయ సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు
- గ్రామీణ మహిళల ఉత్పత్తుల కోసం 'స్వయం ఏపీ' బ్రాండ్ ఆవిష్కరణ
- మహిళలను సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు
- రాబోయే ఐదేళ్లలో మరో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తల తయారీకి ప్రణాళిక



**అమరావతి**

మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, సంపద సృష్టికర్తలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, గ్రామీణ మహిళల నైపుణ్యాలకు, ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో వేదిక కల్పిస్తున్న జాతీయ సరస్ మేళా-2026ను విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. దసరా శరన్నవరాత్రుల వేళ ఇంద్రకీలాద్రి సాక్షిగా ఈ మేళా నిర్వహించడం నగరానికి మరింత శోభను తెచ్చిందన్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి, ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత పదవిని అలంకరించిన

వివరాలు 2లో..

## 'సర్' వివాదం.. 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో 'స్పెషల్ సమ్మరీ రివిజన్'

- తెలుగు రాష్ట్రాలకు త్వరలో ప్రకటన
- ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై తీవ్ర వివాదం
- 17 రాష్ట్రాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు ఈసీ ఆదేశం
- 2027 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎన్నికల సంఘం
- ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు తర్వాత షెడ్యూల్ ప్రకటన

# కూటమి పార్టీల సీట్ల సర్దుబాటు ఖరారు

- స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి జాబితా వచ్చేసింది
- మొత్తం 17 కార్పొరేషన్లలో 11 టీడీపీకి, 4 జనసేనకు, 2 బీజేపీకి కేటాయింపు
- 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలోనూ టీడీపీకి సింహభాగం
- విజయవాడ, కాకినాడ జనసేనకు.. రాజమండ్రి, అనంతపురం కార్పొరేషన్లు బీజేపీకి
- స్థానిక సమరానికి రెండేళ్ల ముందుగానే పక్కా ప్రణాళికతో సిద్ధమైన కూటమి

**అమరావతి**

రాష్ట్రంలో త్వరలో జరగనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి అధికార పక్ష కూటమి సమరశంఖం పూరించింది. సుదీర్ఘ చర్చలు, నియోజకవర్గాల వారీ సమీక్షల అనంతరం తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ల మధ్య మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల స్థానాల కేటాయింపు ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. క్షేత్రస్థాయి బలాబలాలు, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని మూడు పార్టీల అగ్రనేతలు స్థానాల పంపకంపై తుది నిర్ణయానికి వచ్చారు. మొత్తం స్థానాల్లో సింహభాగాన్ని తెలుగుదేశం పార్టీ దక్కించుకోగా, ఆ తర్వాత స్థానాల్లో జనసేన, బీజేపీలు పోటీ చేయనున్నాయి. తాజా ఒప్పందం

వివరాలు 2లో..



## లక్ష్యం నెరవేరింది.. నక్సలిజం ముగిసింది

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- ఆయుధాలను త్యజించి జనజీవన స్రవంతిలో కలిసిన వాళ్లు తమ జీవితాన్ని పునర్నిర్మించుకోవాలి
- ఒకప్పుడు తుపాకీ మోతలు, బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన బస్తర్ ప్రాంతంలో శాంతి పవనాలు వీచాయి
- దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించడం మాత్రమే సరిపోదు
- ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది

## దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు.. 12 కొత్త హాల్టులు



- దేశవ్యాప్తంగా 4 కొత్త రైలు సర్వీసులకు రైల్వే బోర్డు ఆమోదం
- ప్రయాణికుల సౌలభ్యం కోసం 3 రైళ్లను పొడిగించాలని నిర్ణయం
- మరో 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్ల ఏర్పాటు
- త్వరలో తేదీలను ప్రకటించనున్న సంబంధిత రైల్వే జోన్లు



## మున్సిపల్ పోరుకు వైసీపీ అభ్యర్థులు ఖరారు

- మేయర్, ఛైర్మన్ అభ్యర్థుల పూర్తి జాబితా విడుదల
- మేయర్లు, ఛైర్మన్ల పూర్తి జాబితాను విడుదల చేసిన వైసీపీ అధిష్ఠానం
- వైఎస్ జగన్ ఆమోదంతో తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన
- జాబితాలో మహిళలు, బీసీ, ఎస్సీ వర్గాలకు గణనీయమైన ప్రాధాన్యం
- 7 కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలకు అభ్యర్థుల పేర్లు వెల్లడి

## మనం చేసి చూపిద్దాం

- ఏషియన్ గేమ్స్ హీరోలకు ప్రధాని మోదీ కొత్త నినాదం
- ఆసియా క్రీడల పతక విజేతలతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక భేటీ
- క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపిన ప్రధానమంత్రి
- భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్‌గా మారుస్తామని ఉద్ఘాటన
- క్రీడా మౌలిక వసతుల ఆధునికీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం
- మహిళల హాకీ, క్రికెట్, కబడ్డీ జట్ల చారిత్రక విజయాలపై ప్రశంసలు



# మున్సిపల్ పోరుకు వైసీపీ అభ్యర్థులు ఖరారు..



ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల సమరానికి వైసీపీ పూర్తిస్థాయిలో సిద్ధమైంది. పార్టీ అధ్యక్షుడు జగన్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులను, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఛైర్మన్ అభ్యర్థులను ఖరారు చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం అధికారికంగా పత్రికా ప్రకటన ద్వారా అభ్యర్థుల పూర్తి జాబితాను విడుదల చేసింది. మొత్తం 27 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, సామాజిక సమీకరణాలు, మహిళా ప్రాతినిధ్యానికి పెద్దపీట వేసినట్లు స్పష్టమవుతోంది.

**7 కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులు వీరే:**

వైసీపీ ప్రకటించిన జాబితా ప్రకారం, ఏడు కీలక నగర పాలక సంస్థలకు మేయర్ అభ్యర్థులను ఖరారు చేశారు.

విజయనగరం (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): కోలగట్ల శ్రావణి (వైశ్య)
విశాఖపట్నం (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): వరుదు కల్యాణి (కాపు వెలమ)
ఏలూరు (బీసీ): గంటా మోహన్ రావు (తూర్పు కాపు)
మచిలీపట్నం (బీసీ – మహిళ): లంకా జ్యోతి (తూర్పు కాపు)
ఒంగోలు (అన్‌రిజర్వ్‌డ్): కుప్పం ప్రసాద్ (వైశ్య)
నెల్లూరు (అన్‌రిజర్వ్‌డ్): ఆనం విజయ్ కుమార్ రెడ్డి (రెడ్డి)
కడప (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): బండి దీప్తిరెడ్డి (రెడ్డి)

మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్మన్ అభ్యర్థులు:
రాష్ట్రవ్యాప్తంగా 14 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలకు ఛైర్మన్ అభ్యర్థులను పార్టీ అధిష్ఠానం ప్రకటించింది.

**మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థుల జాబితా:**

ఇచ్ఛాపురం (బీసీ – మహిళ): పిలక రాజ్యలక్ష్మి (రెడ్డిక)
పలాస–కాశీబుగ్గ (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): తలసు శ్రీ పద్మ (కళింగ వైశ్య)
నర్సీపట్నం (బీసీ – మహిళ): చింతకాయల అనిత (కాపు వెలమ)
యలమంచిలి (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): బొద్దపు తులసి (కాపు)
తుని (బీసీ – మహిళ): పిట్ల రామ తులసి (శెట్టిబలిజ)
కొవ్వూరు (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): మన్నె పద్మ (కమ్మ)
రామచంద్రాపురం (బీసీ): చింతపల్లి నాగేశ్వరరావు (శెట్టిబలిజ)
కొండపల్లి (ఎస్సీ – మహిళ): నల్లమోతు తేజస్విని (మాదిగ)
తెనాలి (అన్‌రిజర్వ్‌డ్): మద్దాలి శేషాచలం (వైశ్య)
చీరాల (ఎస్సీ – మహిళ): డాక్టర్ ఇస్త్రాల్ల షెర్లీ (మాల)
బద్వేల్ (అన్‌రిజర్వ్‌డ్): రాచపూడి వెంకట సాయి కృష్ణ (వైశ్య)
ప్రొద్దుటూరు (అన్‌రిజర్వ్‌డ్): పొరెడ్డి నరసింహారెడ్డి (రెడ్డి)
పులివెందుల (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): వైయస్ ప్రమీలమ్మ (రెడ్డి)
మదనపల్లె (బీసీ): జింకా చలపతి (బోయ)

**నగర పంచాయతీ ఛైర్మన్ అభ్యర్థులు:**

యలేశ్వరం (ఎస్సీ – మహిళ): బదిరెడ్డి ఆశాలత (మాదిగ)
వుయ్యూరు (ఎస్సీ): పైడముక్కల దివ్య (మాదిగ)
గురజాల (అన్‌రిజర్వ్‌డ్): పోలు వీరారెడ్డి (రెడ్డి)
కనిగిరి (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): పులి శాంతి రెడ్డి (రెడ్డి)
బుచ్చిరెడ్డిపాలెం (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): షేక్ షకీలా బేగం (ముస్లిం)
కమలాపురం (అన్‌రిజర్వ్‌డ్ – మహిళ): మార్జుల కవిత (రెడ్డి)

పార్టీ విడుదల చేసిన ఈ జాబితాలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించారు. మొత్తం 27 స్థానాల్లో 14 స్థానాలు మహిళలకే కేటాయించడం విశేషం. అదేవిధంగా, బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు కూడా గణనీయమైన సంఖ్యలో అవకాశాలు ఇచ్చారు. ఈ ప్రకటనతో ఆయా నగరాలు, పట్టణాల్లో ఎన్నికల సందడి అధికారికంగా మొదలైంది. పార్టీ ప్రకటించిన అభ్యర్థులు త్వరలోనే నామినేషన్లు దాఖలు చేసి, ప్రచార బరిలోకి దిగనున్నారు.

# హాట్‌కేకుల్లా విశాఖ ఉక్కు ప్లాట్ల అమ్మకం



**విశాఖపట్నం** : ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి ఆస్తుల విక్రయ ప్రక్రియ ఊరటనిస్తోంది. నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విశాఖ నగరంలోని ప్రముఖ ప్రాంతాలలో ఉన్న ప్లాట్ల ఈ–వేలానికి రియల్ రంగం నుంచి ఊహించని స్థాయి స్పందన లభించింది. ముఖ్యంగా నగరంలోని వ్యూహాత్మక ప్రాంతమైన హెచ్‌బీ కాలనీలో స్టీల్ ప్లాంట్‌కు చెందిన నిరుపయోగ భూముల విక్రయం కోసం నిర్వహించిన తొలి విడత ఆన్‌లైన్ వేలం ప్రక్రియ అత్యంత విజయవంతంగా ముగిసింది.తొలి విడతలో భాగంగా ఉంచిన ప్లాట్లను సొంతం చేసుకునేందుకు కొనుగోలుదారులు పోటీపడ్డారు. అధికారిక సమాచారం ప్రకారం, మొత్తం 150 ప్లాట్లను విజయవంతంగా విక్రయించగా, దీని ద్వారా ఏకంగా రూ. 366 కోట్లకు పైగా భారీ ఆదాయం సమకూరింది. మేనేజ్‌మెంట్ అంచనా వేసిన అంచనా ఆదాయం కంటే ఈ మొత్తం గణనీయంగా ఎక్కువగా ఉంది . విశాఖ నగరంలో రియల్ ఎస్టేట్ డిమాండ్ ఏ స్థాయిలో ఉందో ఈ వేలం ఫలితాలు మరోసారి రుజువు చేశాయి.ఈ వేలంలో అత్యధికంగా కొన్ని ప్రముఖ ప్రాంతాల్లో గజం ధర ఏకంగా రూ. 1.80 లక్షలకు పైగా పలకింది. జాతీయ రహదారికి సమీపంలో, రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉన్న ప్రదేశాల్లో ఈ ప్లాట్లు ఉండటంతో వ్యాపార వర్గాలు, పెట్టుబడిదారులు వీటిని దక్కించుకునేందుకు ఎగబడ్డారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆర్ఐఎన్ఎల్ భూములకు ఈ స్థాయిలో ఆదరణ లభించడం ప్లాంట్ ఆర్థిక పునరుజ్జీవనానికి పెద్దపీట వేస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.నిరర్థక ఆస్తులను నగదుగా మార్చుకునే వ్యూహంలో భాగంగా చేపట్టిన ఈ ఈ–వేలం ద్వారా ప్లాంట్‌కు తక్షణ ఆర్థిక వనరులు సమకూరే అవకాశం ఏర్పడింది. తొలి విడత విజయం ఇచ్చిన జోరుతో, మిగిలిన భూముల విక్రయానికి సంబంధించి తదుపరి దశ ప్రక్రియను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను సద్వినియోగం చేసుకుంటూ ఆర్జించిన ఈ ఆదాయం విశాఖ ఉక్కు మనుగడకు కొంతవరకు ఊతమిస్తుందనడంలో సందేహం లేదు.

# ట్వీట్లతో పోటీ లెక్క తేల్చేస్తున్న పెద్దలు




**విజయవాడ** : తమిళనాడు ముఖ్యమంత్రిగా తొలిసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన విజయ్ పర్యటన రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది. అయితే విజయ్ పర్యటనలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్కడా కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. విజయ్ విజయవాడ టూర్ షెడ్యూల్ ఖరారైనప్పుడు .. ఆయన వ్యక్తిగతంగా పవన్‌తో భేటీ అవుతారని, లేదంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగే అధికారిక సమావేశంలో డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కల్యాణ్ పాల్గొంటారని జోరుగా ప్రచారం జరిగింది. తీరా చూస్తే, చంద్రబాబుతో జరిగిన జల చర్చల్లో గానీ, పున్నమి ఘాట్ వద్ద జరిగిన విజయవాడ ఉత్సవ్ 2.0 వేదికపై గానీ పవన్ అస్సలు కనిపించలేదు.పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చినప్పుడు.. అదీ సినిమా రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఒక స్టార్ లీడర్ ఏపీకి విచ్చేసిన వేళ, అదే సినీ నేపథ్యం, ప్రజాదరణ ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అధికారిక కార్యక్రమాల్లో భాగస్వామి అయి ఉంటే హుందాగా ఉండేదన్న అభిప్రాయం సాధారణ ప్రజల్లో, అభిమానుల్లో వ్యక్తమైంది. పైగా విజయవాడ నడిబొడ్డున జరిగే సాంస్కృతిక వేడుకలకు ఉప ముఖ్యమంత్రి హాజరు కాకపోవడం వెనుక ఏదైనా ప్రోటోకాల్ సమస్య ఉందా లేక రాజకీయ కారణాలు ఉన్నాయా అన్న ప్రశ్నలు సోషల్ మీడియాలో వెల్లువెత్తాయి. ఏపీ సర్కార్ తరఫున మున్సిపల్ మంత్రి నారాయణ, ఇతర అధికారులు ముందుండి కార్యక్రమాలను నడిపించారే తప్ప, పవన్ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు.పవన్ కల్యాణ్ ఈ పర్యటనకు కావాలనే దూరంగా ఉండటం వెనుక ఒక బలమైన రాజకీయ, ఆత్మగౌరవ కోణం దాగి ఉందని జనసేన వర్గాలు చెబుతున్నాయి. విజయ్ గెలుపును నే సోషల్ మీడియా ట్రోలర్లు పవన్ కల్యాణ్‌ను విజయ్‌తో పోల్చుతూ తీవ్రస్థాయిలో కించపరిచే ప్రయత్నం చేశారు. విజయ్ ఏకంగా సొంతంగా అధికారంలోకి వచ్చారని, పవన్ మాత్రం ఇతర పార్టీల పంచన చేరి డిప్యూటీ సీఎం పదవితో సరిపెట్టుకున్నారంటూ నీచమైన పోలికలతో ట్రోలింగ్ వార్ నడిపారు. ఇప్పుడు ఒకవేళ విజయ్‌ను కలవడానికి వెళ్లినా, లేదా పక్కన నిలబడినా.. డిజిటల్ మాధ్యమాల్లో మళ్లీ పనిగట్టుకుని లేనిపోని పోలికలు తెచ్చి వ్యక్తిత్వ హననానికి దిగుతారన్న ముందస్తు అంచనాతోనే పవన్ వ్యూహాత్మకంగా తప్పుకున్నట్లు తెలుస్తోంది.తన ప్రమేయం వల్ల మీడియా ఫోకస్ అసలు చర్చలైన తెలుగుగంగ, గోదావరి?కావేరి జలాల నుంచి పక్కదారి పట్టి.. అనవసరమైన స్టార్ వార్స్ , పొలిటికల్ ట్రోలింగ్‌గా మారకూడదన్న ఉద్దేశంతోనే పవన్ కల్యాణ్ పూర్తి పరిపక్వతతో వ్యవహరించారని భావిస్తున్నారు. ప్రత్యర్థులకు ఎలాంటి రాజకీయ ఆయుధాన్ని చేతికి ఇవ్వకూడదన్న వ్యూహంతోనే ఈ టూర్‌కు పూర్తిగా దూరంగా ఉంటూ, ప్రభుత్వం తరఫున చంద్రబాబు?విజయ్ భేటీ సజావుగా సాగేలా చేశారని అంటున్నారు. ఇద్దరు సౌత్ ఇండియన్ సూపర్ స్టార్లు రాజకీయ వేదికపై ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తారని ఆశపడిన అభిమానులకు నిరాశే మిగిలినప్పటికీ, పవన్ తీసుకున్న ఈ దూరపు నిర్ణయం విమర్శకుల నోళ్లు మూయించేలా వ్యూహాత్మక అడుగుగానే నిలిచిందని అనుకోవచ్చు.

## కూటమి పార్టీల సీట్ల సర్దుబాటు ఖరారు

-మొదటిపేజీ తరువాయి

ప్రకారం కూటమి భాగస్వామ్య పక్షాలకు కేటాయించిన స్థానాల వివరాలు ఇలా ఉన్నాయి.

**కార్పొరేషన్ల వారీగా పంపకాలు**

రాష్ట్రంలోని కీలకమైన మున్సిపల్ కార్పొరేషన్ల పంపకాల్లో తెలుగుదేశం పార్టీ పైచేయి సాధించింది. మొత్తం కార్పొరేషన్లలో టీడీపీ 11 స్థానాల్లో, జనసేన 4 స్థానాల్లో, బీజేపీ 2 స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దించనున్నాయి.

తెలుగుదేశం పార్టీ (11): విజయనగరం, గ్రేటర్ విశాఖపట్నం, మచిలీపట్నం, మంగళగిరి–తాడేపల్లి, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కడప, కర్నూలు, తిరుపతి, చిత్తూరు.
జనసేన పార్టీ (04): శ్రీకాకుళం, కాకినాడ, ఏలూరు, విజయవాడ.
భారతీయ జనతా పార్టీ (02): రాజమండ్రి, అనంతపురం.

మున్సిపాలిటీల కేటాయింపు ఇలా : ఉమ్మడి జిల్లాల వారీగా, స్థానిక ప్రాధాన్యతలను బట్టి మున్సిపాలిటీలను కేటాయించారు.

జనసేన పోటీ చేసే మున్సిపాలిటీలు (21) : ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలతో పాటు రాయలసీమలోని కొన్ని కీలక పురపాలక సంఘాలను జనసేన కైవసం చేసుకుంది.
ఉత్తరాంధ్ర : పాలకొండ, రాజాం, సాలూరు.
ఉమ్మడి తూర్పు గోదావరి : తుని, గొల్లప్రోలు, పిఠాపురం, సామర్లకోట, అమలాపురం, ముమ్మిడివరం.
ఉమ్మడి పశ్చిమ గోదావరి : నిడదవోలు, నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం.
కృష్ణా, గుంటూరు జిల్లాలు : తిరువూరు, పెడన, తెనాలి, చిలకలూరిపేట.
ప్రకాశం, రాయలసీమ : దర్శి, మడకశిర, పుట్టపర్తి, పుత్తూరు.

బీజేపీ పోటీ చేసే మున్సిపాలిటీలు (07) :పలు జిల్లాల్లో పట్టున్న స్థానాలను కమలం పార్టీ దక్కించుకుంది.
కోస్తాంధ్ర : నెల్లిమర్ల, యలమంచిలి, బాపట్ల, కావలి, గూడూరు (నెల్లూరు జిల్లా).
రాయలసీమ, ప్రకాశం : కూటమి గిద్దలూరు, ఎర్రగుంట్ల, గూడూరు (కర్నూలు).

సమన్వయంతో ముందుకు : సీట్ల సర్దుబాటు ముగియడంతో కూటమి శ్రేణులు క్షేత్రస్థాయిలో ఉమ్మడి ప్రచారానికి సిద్ధమవుతున్నాయి. ఎక్కడా అసమ్మతికి తావులేకుండా, అంతర్గత విభేదాలను పక్కనబెట్టి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కూటమి విజయకేతనం ఎగరేయడమే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నారు.

## ప్రతి గ్రామాన్ని ఉపాధి కేంద్రంగా మార్చడమే ధ్యేయం

-మొదటిపేజీ తరువాయి



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

**గ్రామాలే ఉపాధి కేంద్రాలుగా..**

రాష్ట్రంలో 1.10 కోట్ల మంది సభ్యులతో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా) ఉన్నాయని, ఇవి ఏటా రూ.69 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాయని చంద్రబాబు వివరించారు. నిన్నటి పొదుపు సంఘాలు నేడు వ్యాపార సంస్థలుగా రూపాంతరం చెందుతున్నాయని, భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ మేళాలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని, ఇది కేవలం ప్రదర్శన కాదని, గ్రామీణ ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెటింగ్ అవకాశాలు కల్పించే దిశగా తొలి అడుగని పేర్కొన్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ, కొత్త వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని మహిళలకు సూచించారు.

**సాంకేతికతతో ప్రపంచ మార్కెట్‌కు..**

'స్వయం ఏపీ' బ్రాండ్ ఉత్పత్తులను ఈ–కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేస్తామని చంద్రబాబు తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు. మహిళల భద్రత, ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూనే, వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఒక ఉపాధి కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌కు బిగ్‌షాక్




వైఎస్సార్సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసులో ఈడీ పిటిషన్లపై సీబీఐ కోర్టు రోజువారీ విచారణ ప్రారంభించింది. అరబిందో, హెటిరో సంస్థల కేసులో జగన్ దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్‌పై సీబీఐ కోర్టు ప్రధాన న్యాయమూర్తి పట్టాభి రామారావు విచారణ చేపట్టారు. ప్రధాన నిందితుడు జగన్ దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌పై ఆయన తరపు న్యాయవాది అశోక్ రెడ్డి వాదనలు వినిపించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు వర్తించదని, క్రిమినల్ కేసు తేలకుండా ఈడీ కేసు నమోదు చేయడం చెల్లదని ఆయన వాదించారు.

జగన్ అక్రమాస్తులకు సంబంధించి 2006 నుంచి 2021 వరకు ఈడీ తొమ్మిది ఛార్జిషీట్లు దాఖలు చేసింది. ఈ ఛార్జిషీట్ల అన్నింటిలోనూ జగన్ ఏ1 నిందితుడిగా ఉన్నారు. జగన్ కేసుల్లో అటు సీబీఐ దాఖలు చేసిన 11 ఛార్జిషీట్లపై మాత్రమే ఇప్పటి వరకు రోజువారీ విచారణ చేపడుతోంది. ఈ విచారణ పూర్తయిన తర్వాతే ఈడీ కేసుల విచారణ ప్రారంభమవుతుందన్న ఉద్దేశంతో ఈడీ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేసింది. సీబీఐ కోర్టులో తాము నమోదు చేసిన 9 కేసుల విచారణలో కదలిక లేదని ఆ పిటిషన్‌లో పేర్కొంది. దీంతో ఇకపై ఈడీ కేసుల్లోనూ రోజువారీ విచారణకు సీబీఐ కోర్టు అంగీకరించింది. సీబీఐ, ఈడీ కేసులపై కోర్టుకు లభించే సమయాన్ని బట్టి రెండింటిపై విచారణ చేపడుతున్నారు.

**వాస్తవ ధర కంటే అధికంగా పెట్టుబడులు**

వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా హెటిరో, అరబిందోలకు తెలంగాణలోని జడ్చర్లలో చెరో 75 ఎకరాల భూకేటాయింపులకు ప్రతిఫలంగా అరబిందో, ట్రైడెంట్ రూ.10 కోట్లు, హెటిరో రూ.19 కోట్ల 50 లక్షలు ఆయన కుమారుడు జగన్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాయని ఈడీ కేసు నమోదు చేసింది. ప్రభుత్వం నుంచి లబ్ధి పొందినందుకు ప్రతిఫలంగా లబ్ధిదారులు జగన్‌కు చెందిన జగతి పబ్లికేషన్స్, భారతి సిమెంట్స్ తదితర కంపెనీల్లో షేర్ వాస్తవ ధర కంటే అధిక ప్రీమియంతో పెట్టుబడులు పెట్టారని ఈడీ వాదిస్తోంది.

సీబీఐ ఛార్జిషీట్ ఆధారంగా పీఎంఎల్ఏ కేసు నమోదు చేసిన ఈడీ ఈ ఒక్క కేసులోనే రూ.51 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. హెటిరో డ్రగ్స్‌కు చెందిన 35 ఎకరాల భూమి, రూ.3 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, అరబిందో ఫార్మాకు చెందిన 96 ఎకరాల భూమి, రూ.3 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, జననీ ఇన్‌ఫ్రాకు చెందిన 13 ఎకరాలకు పైగా భూమి, జగతి పబ్లికేషన్స్‌కు చెందిన రూ.14.5 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఈడీ జప్తులో ఉన్నాయి.

# మహిళా కిసాన్ దివస్ కార్యక్రమం.





**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 15:** మండలం లోని, తగరంపూడి గ్రామంలో వ్యవసాయ శాఖ, ఆత్మ వారి సౌజన్యంతో మహిళా కిసాన్ దివస్ ప్రోగ్రాం ఏర్పాటు చేయడం జరిగింది. మహిళా రైతులు, వ్యవసాయంలో మహిళా రైతులు పాత్ర అనే అంశం పై మహిళ దినోత్సవ సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డిడిఏ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మహిళా రైతుల ముఖ్య పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అదే విధంగా ఎలినినో ప్రభావం గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ వాతావరణ అనుసరించి రైతుల పంటలు పండించాలని తెలిపారు. వరిలో తక్కువ కాలపరిమితి గల పంటలను పండించాలని రైతులకు తెలిపారు. రసాయనిక ఎరువులు బదులు సేంద్రియ ఎరువులు వాడాలని తెలిపారు. ఎలినినో ప్రభావం అనుసరించి రైతుల తక్కువ కాలపు పంటలు పండించాలని తెలిపారు. వరి పంట లో వచ్చే తెగుళ్లు,పురుగులు వాటి యాజమాన్యం పద్ధతులు గురించి రైతులకు వివరించారు. అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు కే.ధనలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న రాయితీలు, పథకాల గురించి తెలిపారు. అదే విధంగా పంటల్లో వచ్చే చీడ,పురుగులు గురించి రైతులకు వివరించారు, వరి పంటకు గాను పొటాషియం రెండు దపాలుగా వేయాలని తెలిపారు, సూక్ష్మ పోషకాలు కూడా వెయ్యాలని తెలిపారు. రైతులు సేంద్రియ ఎరువులు కూడా వాడాలని తెలిపారు. ఈ సమీకృత వ్యవసాయ విధానం అనేది పాడి,పంట అని తెలిపారు. అదేవిధంగా మహిళా రైతులు సేంద్రీయ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, పశువులు, గేదలు, ఆవులు, గొర్రెలు, మేకలు, ఉద్యానవన పంటలు, నూతన వ్యవసాయ విధాన పద్ధతులు పాటించాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి రైతు ఎరువులు వినియోగం తగ్గించాలని, సేంద్రియ ఎరువులు వాడాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి పివి రంగాచారి మాట్లాడుతూ మహిళా రైతులు వ్యవసాయ రంగంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. సమీకృత వ్యవసాయ విధానంలో పుట్టగొడుగుల పెంపకం, తేనెటీగల పెంపకం, కూరగాయలు పెంపకం, కిచెన్ గార్డెన్ వంటి పద్ధతులు మహిళ రైతులు పాటించాలని తెలిపారు. అదేవిధంగా రసాయనిక ఎరువులు బదులు సేంద్రియ ఎరువులు వాడాలని తెలిపారు, రైతులందరూ సమీకృత వ్యవసాయం చేయాలని అన్నారు. రైతులందరూ జీవన ఎరువులు అయినటువంటి, కేఆర్బి, ఏఎస్బి, పిఎస్బి, జీవన ఎరువులు వాడాలని తెలిపారు. ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ మాట్లాడుతూ ఈ మహిళా కిసాన్ దివాస్ కార్యక్రమం మహిళ దినోత్సవం సందర్భంగా మహిళ రైతులకు అవగాహన సదస్సు కింద ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళా రైతులు వ్యవసాయ రంగంలో ఎక్కువగా రాణిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా సమీకృత వ్యవసాయ విధానమనేది పాడి, పంట అనే నినాదంతో పూర్వం మన రైతులు ఈ సమీకృత వ్యవసాయ పద్ధతులు పాటించేవారు అని తెలిపారు. ఈ సమీకృత వ్యవసాయ పద్ధతులు వలన అధిక ఆదాయము సమకూరుస్తుందని తెలిపారు. అదేవిధంగా సమగ్ర పోషక ఎరువులు వినియోగం ఎంత అవసరం అని,ఇందులో రసాయన ఎరువులతో పాటు,సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు మరియు పచ్చి రొట్టె ఎరువులు సమతుల్యంగా ఉపయోగించాలని, తెలిపారు. రైతులందరూ కేవలం రసాయన ఎరువుల పై మాత్రమే ఆధారపడకుండా నేల పరీక్షలు ఆధారంగా అవసర మైన మోతాదులో ఎరువులు వాడితే పంటలు బాగా పెరుగుతాయని, దిగుబడి మెరుగుపడి, నేల సారం పెరుగుతుందని, పంట దిగుబడి మెరుగువుతుందని ఎరువులు ఖర్చు తగ్గుతుందని పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ జీవన ఎరువులు వాడాలని తెలిపారు. అదేవిధంగా ఎకరాకు 500 ఎంఎల్ నానో యూరియా అన్ని రకాల పంటలకు పిచికారి చేసుకోవచ్చని తెలిపారు. తప్పనిసరిగా పాటించాలని తెలిపారు, అదేవిధంగా ప్రతి రైతు తప్పనిసరిగా రసాయనికి ఎరువులు బదులుగా,జీవన ఎరువులు వాడాలని తెలిపారు రైతులు ఈ జీవన ఎరువులు వాడకం వలన భూమి సారవంతం అవుతుందని తెలిపార. పకృతి వ్యవసాయ సిబ్బంది వి. లక్ష్మి మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చు అని తెలిపారు. అదేవిధంగా ఈ ప్రకృతి వ్యవసాయ విధానము ద్వారా రైతులు బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవాలని రైతులకు తెలిపారు. ప్రతి ఒక్క రైతు పీఎండీఎస్ విత్తనాల వేయాలని తెలిపారు, అదేవిధంగా ప్రతి రైతు విత్తనగులుకుల తయారు చేసుకోవాలని తెలిపారు. రైతులందరూ పకృతి వ్యవసాయం చెయ్యడం వలన అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం పి. రామకృష్ణ, పకృతి వ్యవసాయ సిబ్బంది, యాదగిరి నారాయణరావు రైతులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణ దేవి అలంకరణలో అమ్మవారు.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 15:**పట్టణం లోని గౌరీ పంచాయతన దేవాలయంలో శ్రీదేవి నవరాత్రి మహోత్సవాలు భాగంగా లక్ష్మివారం అర్చకులు అంపోలు గోపాల కృష్ణ శర్మ, అంపోలు రాంప్రసాద్ శర్మ, ఆధ్వర్యంలో అమ్మవారు భక్తులకు అన్నపూర్ణ దేవిగా గా భక్తులకు దర్శనమిచ్చారు. మండపంలో మహిళలు ఇంటి వద్ద తయారుచేసిన వివిధ రకాల పిండి వంటలను అమ్మవారికి సమర్పించి సారె ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అమ్మవారి దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో
ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసి నాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఆళ్ళ మహాలక్ష్మి నాయుడు, మళ్ల సురేష్, ఆళ్ల ప్రసాద్, పాలకవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం జరిగింది.

# వశిష్ట డెయిరీలో నాలుగు శాఖల అధికారుల సంయుక్త తనిఖీలు.





**పలు నిబంధనలు ఉల్లంఘనలు గుర్తింపు.**

**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 14:** అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం చిన్నయ్యపాలెం లోని వశిష్ట డెయిరీలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ, పౌరసరఫరాలు, పంచాయతీ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ మురళీకృష్ణ నేతృత్వంలో జరిగిన ఈ తనిఖీల్లో పలు నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు. ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ తయారీ యూనిట్‌లో నీటి నిల్వ ట్యాంకు సమీపంలో అపరిశుభ్ర పరిస్థితులను గుర్తించారు. తయారీ తేదీ, గడువు తేదీ వంటి తప్పనిసరి వివరాలు లేని సుమారు రూ.70 వేల విలువైన ఆహార ఉత్పత్తులతో పాటు గడువు ముగిసిన శీతల పానీయాలను గుర్తించారు. వాణిజ్యేతర వినియోగానికి ఉద్దేశించిన నాలుగు ఎల్‌పీజీ సిలిండర్లను వినియోగిస్తున్నట్లు, సుమారు ఏడాది కాలంగా ట్రేడ్ లైసెన్స్ లేకుండా యూనిట్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. గేదె నెయ్యి, ఆవు నెయ్యి, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌కు సంబంధించిన మూడు నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. నివేదికల ఆధారంగా చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. జిల్లాలో ఆహార భద్రత, పరిశుభ్రత ప్రమాణాల అమలుకు సంయుక్త తనిఖీలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# సీపీఎం అంటే ప్రభుత్వానికి ఎందుకంత భయం?.

**హోంమంత్రి నియోజకవర్గంలో పోలీసు రాజ్యం!.**
**పోలీసు పహారాలో ప్రజాభిప్రాయ సేకరణ!.**
**అరెస్టులు, నిర్భందాలతో ప్రజల గొంతు నొక్కలేరు!.**
**సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాధం.**





**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 15**: జిల్లా నక్కపల్లిలో గురువారం (అక్టోబర్ 15న) జరుగుతున్న మిట్టల్ పోర్టు ప్రజాభిప్రాయ సేకరణకు వెళుతున్న సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వర రావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణలు, ఎస్. రాయవరం మండలం అడ్డరోడ్డు లో పోలీసులు అరెస్టు చేయడాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాధం ఖండించారు. వీరినే కాక రైతు సంఘం జిల్లా కార్యదర్శి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. అప్పలరాజును గత మూడు రోజులుగా గృహనిర్బంధంలో ఉంచడాన్ని, ఈ రోజు తెల్లవారు నుండి సిపిఎం ఎస్.రాయవరం మండల కార్యదర్శి ఎం.సత్యనారాయణ, నక్కపల్లి మండల కార్యదర్శి ఎం.రాజేష్, రాజయ్యపేట గ్రామ కార్యదర్శి ఎం.మహేష్ బాబు లను గృహనిర్బంధించడాన్ని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాధం తీవ్రంగా ఖండించారు. సీపీఎం నాయకులంటే ప్రభుత్వానికి ఎందుకంత భయం?, ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తే అరెస్టులు, అభ్యంతరాలు చెబితే నిర్బంధాలా?, పోలీసు బలంతో ప్రజా గళాన్ని నొక్కేయాలనే ప్రభుత్వ వైఖరి ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అన్నారు. అరెస్టు చేసిన వారిని గృహ నిర్బంధంలో ఉన్న నాయకులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజాభిప్రాయ సేకరణలను పోలీసు పహారా మధ్య ప్రభుత్వం నిర్వహించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమే. గతంలో రాజకీయ పార్టీల నాయకులు, పర్యావరణ శాస్త్రవేత్తలు, అనేక మంది మేధావులు స్వేచ్ఛగా పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించేవారు. కానీ నేడు ఆ స్వేచ్ఛకు తిలోదకాలిచ్చారు. ముఖ్యంగా హోంమంత్రి నియోజకవర్గంలో తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తూ పోలీసు రాజ్యాన్ని నడుపుతున్నారు. సీపీఎం పార్టీని లక్ష్యంగా చేసుకుని అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడటం అప్రజాస్వామికం. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాస్వామిక విలువలు కోసం మాట్లాడిన హోంమంత్రి నేడు ఇలాంటి చర్యలకు పాల్పడటం అవివేకం. ప్రజాభిప్రాయ సేకరణలు ప్రజల మద్దతుతో జరగాలి తప్ప, పోలీసు నిర్బంధాల మధ్య కాదని కె.లోకనాధం హితవు పలికారు. సముద్రాన్ని నమ్ముకుని తరతరాలుగా జీవిస్తున్న మత్స్యకారుల బతుకులను బలిపెట్టి మిట్టల్ పోర్టుకు అనుమతులు ఇవ్వాలని చూడటం అన్యాయం. పోర్టు నిర్మాణంతో మత్స్యకారుల ఉపాధి, చేపల వేట, తీరప్రాంత పర్యావరణం పై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉన్నప్పటికీ, ఈ సమస్యలను పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక (ఇఐఎ) సమగ్రంగా ప్రతిబింబించడం లేదని సీపీఎం ఆందోళన వ్యక్తం చేస్తోంది. గతంలో మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు సంబంధించి ఇచ్చిన హామీలే పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమా?, మత్స్యకారులు, ప్రజల బతుకులకు విలువ లేదా?, లోపభూయిష్ట మైన నివేదికను సరిదిద్ది, ప్రభావిత గ్రామాల వాస్తవ పరిస్థితులు, మత్స్యకారుల జీవనోపాధి సమస్యలను పూర్తిగా వెల్లడించి, ప్రజలకు సమగ్ర సమాచారం అందించిన తర్వాతే ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలి. ప్రజల అభ్యంతరాలను పక్కనపెట్టి, పోలీసు పహారాలో ప్రజాభిప్రాయ సేకరణను ఒక తంతుగా మార్చడాన్ని సీపీఎం అంగీకరించదు. ప్రజాభిప్రాయ సేకరణకు రాజకీయ పార్టీల నాయకులు, మత్స్యకారులు, ప్రభావిత గ్రామాల ప్రజలు ఎలాంటి పోలీసు ఆంక్షలు లేకుండా స్వేచ్ఛగా హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం కల్పించకపోవడం దుర్మార్గం. ప్రజాభిప్రాయాన్ని వినడానికి భయమెందుకు?, ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పాలకులు అరెస్టులను అడ్డుపెట్టుకుని ఎంతకాలం పాలిస్తారు?, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రజల గొంతుకను అణచివేయాలనే ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలన్నారు. అరెస్టు చేసిన, నిర్భందంలో ఉన్న సిపిఎం నాయకులను వెంటనే విడుదల చేయకపోతే ప్రజా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# గ్రీన్ ఫీల్డ్ కాప్టివ్ పోర్టు పై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ.







జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.

**నక్కపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 15:** జిల్లాలో నక్కపల్లి మండలంలో ఏఎంఎన్ఎస్ పోర్ట్స్ రాజయ్యపేట ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతిపాదించిన గ్రీన్ ఫీల్డ్ కాప్టివ్ పోర్టు నిర్మాణానికి సంబంధించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ (ఎన్విరాన్మెంటల్ పబ్లిక్ హియరింగ్) గురువారం ఉదయం నక్కపల్లి లోని ప్రాజెక్టు సమీపంలో నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. దొనేవాని లక్ష్మీపురం, గునుపూడి గ్రామాల పరిధిలో సుమారు 2.9 కిలో మీటర్ల సముద్రతీర ముఖభాగంలో ఈ గ్రీన్ ఫీల్డ్ కాప్టివ్ పోర్టును అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించారని, పర్యావరణ అనుమతి (ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్ - ఈసీ) పొందే ప్రక్రియలో భాగంగా ఈ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సుమారు 870 మంది ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వారిలో మొత్తం 19 మంది తమ అభిప్రాయాలు, ఆందోళనలు, సూచనలను అధికారులకు తెలిపారు. పాల్గొన్న వారిలో అత్యధికులు ప్రతిపాదిత పోర్టు ప్రాజెక్టును స్వాగతించి మద్దతు తెలిపారని, కొంత మంది తమ సూచనలను వ్యక్తం చేశారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో వ్యక్తమైన సూచనలు, ఆందోళనలను అధికారికంగా నమోదు చేసి, తదుపరి పరిశీలన నిమిత్తం వర్తించే పర్యావరణ అనుమతుల విధానాల ప్రకారం చర్యలు చేపడతామని తెలిపారు. స్థానిక ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయడానికి అవకాశం కల్పించడమే ఈ సేకరణ ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, విశాఖపట్నం జోనల్ కార్యాలయ జాయింట్ చీఫ్ ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ ఎస్. శంకర్ నాయక్, ప్రాంతీయ కార్యాలయ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పి.వి. ముకుంద రావు తదితర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# అమ్మవారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్.




**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 15:**ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భాగంగా గురువారం అమ్మవారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్. ఆలయ మండపంలో చక్ర మేరువుకు అభిషేకంలో పాల్గొని ఎంపీ సీఎం రమేష్ వ్యక్తిగత కార్యదర్శి విజయ్ నాయుడు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న సమారాదాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్
పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు.




జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 15**: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిందని, అందులో భాగంగా జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం పత్రికా ప్రతినిధులతో ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలు, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల ముఖ్య మైన తేదీల వివరాలు తెలియజేశారు. అర్బన్ లోకల్ బాడీస్ (మున్సిపాలిటీలు, జీవీఎంసీ అనకాపల్లి జోన్) అక్టోబర్ 16 నుండి అక్టోబర్ 18 వరకు నామినేషన్ల స్వీకరించడం జరుగుతుందని, అక్టోబర్ 19 న నామినేషన్ల పరిశీలన జరుగుతుందన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ, అభ్యర్థుల తుది జాబితాను అక్టోబర్ 21 న విడుదల చేస్తామన్నారు. అక్టోబర్ 28 న (అనకాపల్లి జీవీఎంసీ జోన్, యలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీలకు) పోలింగ్ జరుగుతుందన్నారు. రీపోలింగ్ (అవసర మైతే) అక్టోబర్ 29 నిర్వహిస్తామని, అక్టోబర్ 30 ఓట్ల లెక్కింపు, ఫలితాలను వెల్లడించడం జరుగుతుందన్నారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల షెడ్యూల్: అక్టోబర్ 19 న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, అక్టోబర్ 21 నుండి అక్టోబర్ 23 వరకు నామినేషన్ల స్వీకరణ, అదే విధంగా అక్టోబర్ 24 న నామినేషన్ల పరిశీలన, అప్పీళ్ల పరిష్కారం అక్టోబర్ 25, అప్పీళ్ల డిస్పోజల్ అక్టోబర్ 26 తేదీన జరుగుతుందన్నారు. అక్టోబర్ 27 న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ మరియు అభ్యర్థుల తుది జాబితా విడుదల విడుదల చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలియజేశారు. నవంబర్ 3 న పోలింగ్ జరుగుతుందని, రీపోలింగ్ (అవసరమైతే) నవంబర్ 4 నిర్వహిస్తామని వెల్లడించారు. నవంబర్ 5 న ఓట్ల లెక్కింపు, ఫలితాలను వెల్లడించడం జరుగుతుందన్నారు.

గ్రామీణ స్థానిక సంస్థల (పంచాయతీ రాజ్) ఎన్నికలకు సంబంధించి 642 గ్రామ పంచాయతీలకు మూడు విడతలుగా ఎన్నికలు జరగనున్నట్లు, కొన్ని కారణాల వల్ల నాలుగు పంచాయతీలలో ఎన్నికలు వాయిదా పడ్డాయని, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ తెలిపారు.

మొదటి విడత ఎన్నికల తేదీ: 1, నవంబర్ 26 (అనకాపల్లి డివిజన్ లోని 10 మండలాలు). 2, రెండవ విడత ఎన్నికల తేదీ: నవంబర్ 29 (నర్సీపట్నం డివిజన్‌లోని 7 మండలాలు). 3, మూడవ విడత ఎన్నికల తేదీ: డిసెంబర్ 2 (అడ్డరోడ్డు డివిజన్ లోని 7 మండలాలు). మొదటి విడత: నవంబర్ 26 (ఉదయం పోలింగ్, మధ్యాహ్నం నుండి ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి).

రెండవ విడత: నవంబర్ 29 (ఉదయం పోలింగ్, మధ్యాహ్నం నుండి ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి).

మూడవ విడత: డిసెంబర్ 2 (ఉదయం పోలింగ్, మధ్యాహ్నం నుండి ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి). ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ... అనకాపల్లి జీవీఎంసీ జోన్‌కు సంబంధించిన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జీవీఎంసీ కమిషనర్ వెల్లడించారు. ఈ ఎన్నికల ఏర్పాట్లు, నిర్వహణ ప్రక్రియకు సంబంధించి అనకాపల్లి జీవీఎంసీ జోన్ పరిధిలోని 6 వార్డులకు ఎన్నికలు జరుగుతాయని, మొత్తం 89 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటిని 20 రూట్లలో వర్గీకరించినట్లు తెలిపారు.

మేయర్ ఓటింగ్‌కు పింక్ కలర్ బ్యాలెట్ పేపర్, వార్డు మెంబర్లు, కార్పొరేటర్ల ఓటింగ్ కు వైట్ కలర్ బ్యాలెట్ పేపర్ ఉపయోగిస్తారని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ అంతా ఈసారి బ్యాలెట్ బాక్సుల ద్వారానే నిర్వహిస్తామన్నారు. 6 వార్డుల పర్యవేక్షణకు ఇద్దరు రిటర్నింగ్ ఆఫీసర్లు, ఇద్దరు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. భద్రత కోసం 6 గురు సెక్టార్ మెజిస్ట్రేట్లను, పోలీస్ బందోబస్తును సమన్వయం చేశామని, రావు గోపాలరావు కళాక్షేత్రం వద్ద డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రేపటి నుండి 3 రోజుల పాటు ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు జోనల్ ఆఫీస్‌లో నామినేషన్లు స్వీకరిస్తారని, ఎన్నికల నియమావళి అమలులో భాగంగా బ్యానర్లు, పోస్టర్లు తొలగించే కార్యక్రమం వేగంగా జరుగుతోందని పేర్కొన్నారు. ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా కలెక్టరేట్, జోనల్ ఆఫీస్ మరియు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. అభ్యర్థుల అనుమతుల కోసం జోనల్ ఆఫీస్ లోనే సింగిల్ విండో విధానాన్ని అందుబాటులోకి తెచ్చామని జీవీఎంసీ కమిషనర్ స్పష్టం చేశారు.

ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం పటిష్ట భద్రత ఏర్పాట్లు పూర్తయ్యాయని, గత ఒక నెల రోజులుగా ఎన్నికల కోసం పోలీసు ముందస్తు సన్నాహాలు చేస్తున్నారని, సమస్యాత్మక ప్రాంతాల పై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. సుమారు 4,500 మందికి పైగా ట్రబుల్ మోంగర్స్‌ను (శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని) గుర్తించి, వారికి కౌన్సెలింగ్ ఇచ్చి బైండోవర్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ప్రవర్తనా నియమావళి కఠినంగా అమలవుతోందని, నేటి నుంచి దీనిని మరింత కఠినంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనల పర్యవేక్షణ కోసం జీవీఎంసీ, జిల్లా యంత్రాంగం, పోలీసు విభాగంతో కూడిన ఎమ్మెస్సీ (ఎంసీసీ) బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించారు.

ఓటర్లకు పోలింగ్ స్టేషన్ల వివరాలను అందిస్తున్నామని, ఎటువంటి ఓటర్ బెదిరింపులు లేదా అక్రమాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేలా కృషి చేస్తామని తెలిపారు. ఓటర్లు ఎవరివైనా అసాధారణ కార్యకలాపాలు గమనిస్తే వెంటనే 112 కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నామినేషన్లు, ప్రచారం, ర్యాలీలు, సభల నిర్వహణకు సంబంధించి అభ్యర్థులందరూ ఎమ్మెస్సీ (ఎంసీసీ) నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా లైసెన్సుడ్ ఆయుధాల డిపాజిట్ ప్రక్రియ సుమారు 70 శాతం పూర్తయిందని, మిగతావి రాబోయే 24 గంటల్లో పూర్తికానున్నాయని తెలిపారు.

ఈ పత్రికా ప్రతినిధుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, అనకాపల్లి, నర్సీపట్నం, అడ్డు రోడ్డు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, అనకాపల్లి జిల్లా పరిషత్తు సిఈవో, డిప్యూటీ సిఈవో, తదితరులు పాల్గొన్నారు.

# లలిత త్రిపుర సుందరి దేవిగా దుర్గమ్మ.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 15:** గవరపాలెం శతకం పట్టు లో కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి మహోత్సవంలో భాగంగ గురువారం అమ్మవారికి లలిత త్రిపుర సుందరి దేవిగా అలంకరణ చేసారు. ఉదయగిరి చంద్రశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు కే హరినారాయణ ఆధ్వర్యంలో అమ్మవారికి నిత్య పూజ్యులు అభిషేకాలు నిర్వహించారు.

ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు అండ్ బ్రదర్స్ ఆర్థిక సహకారంతో మాల ధారణ చేసిన భవానీ భక్తులకు నవరాత్రి పది రోజులు అన్న సమారాధన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, భీశెట్టి ప్రసన్న, పొలమరశెట్టి సూర్య, కాండ్రేగుల రేవంత్, కోరిబిల్లి ఉదయ్ఉ, త్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల కోడ్ యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్న టీడీపీ

**తాడేపల్లి: పెన్ సత్తా, అక్టోబర్ 15**: రాష్ట్రంలో స్థానిక ఎన్నికల దృష్ట్యా ప్రవర్తనా నియమావళి (కోడ్) అమలులో ఉన్నా, ఎక్కడా అధికార టీడీపీ దాన్ని పాటించడం లేదని.. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సహా, ఆ పార్టీ నాయకుల చిత్రాలతో కూడిన ఫ్లెక్సీ బ్యానర్లు, హోర్డింగ్‌లు, కటౌట్లు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి ప్రదర్శిస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ)కు లేఖ రాసిన వైయస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వాటిపై తక్షణం చర్య తీసుకోవాలని, అన్నీ తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్, పంచాయతీ, రెవెన్యూ అధికారులు ఈ ప్రచార ప్రదర్శనలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆ లేఖలో లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. ఎన్నికలకు ముందు తమ పార్టీ నాయకత్వాన్ని ప్రసన్నం చేసుకోవడానికి, తమ రాజకీయ పలుకుబడిని ప్రదర్శించడానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇటువంటి ప్రచార సామగ్రిని ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో వర్తించే ఆంక్షలను వారు



పట్టించుకోవడం లేదన్నారు. సంబంధిత అధికారులు కూడా ఈ ప్రచార ప్రదర్శనలపై చర్యలు తీసుకోవడంలో విఫలమవడంతో, ఎన్నికల నియామావళిని నిష్పక్షపాతంగా అమలు చేయడంపై అనుమానాలు తలెత్తుతున్నాయని వెల్లడించారు.

అధికారంలో ఉన్న పార్టీకి చెందిన ప్రచార సామగ్రిని ఎటువంటి అడ్డంకులు లేకుండా కొనసాగించడానికి అనుమతించడం, స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాత ఎన్నికలకు అవసరమైన సమాన అవకాశాల స్థాయిని దెబ్బ తీస్తుందని ఆ లేఖలో లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. కాబట్టి, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తూ టీడీపీ ప్రదర్శిస్తున్న ప్రచార సామగ్రిని గుర్తించి వెంటనే తొలగించాలని, కొత్తగా అనధికారికంగా ఏర్పాటు చేసే వాటిని పూర్తిగా నిరోధించాలని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించాలని ఆయన ఎన్నికల కమిషనర్‌ను కోరారు. అలాగే, ప్రతి జిల్లాలో తీసుకున్న చర్యలకు సంబంధించి నిర్ణీత గడువులోగా ఫాలో అప్ నివేదికలను సమర్పించేలా ఆదేశించాలని, ఆదేశాలను అమలు చేయడంలో విఫలమయ్యే అధికారుల బాధ్యతను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంకా, ఎన్నికల ప్రవర్తనా నియామవళి రాష్ట్రవ్యాప్తంగా ఎటువంటి జాప్యం లేకుండా, సమానంగా, నిష్పక్షపాతంగా అమలయ్యేలా ఎన్నికల కమిషన్ తక్షణమే జోక్యం చేసుకోవాలన్న లేళ్ల అప్పిరెడ్డి, ఆ లేఖ ప్రతిని కేంద్ర ఎన్నికల కమిషరీ కు కూడా పంపారు.

## దివీస్ సంస్థ సహకారంతో చంద్రంపాలెం పాఠశాలలో పరిశుభ్రత కార్యక్రమం

పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ఎస్ఎంసీ చర్యలు.. నాలుగు పెద్ద చెత్త కుండీలు, స్వీపర్లను ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్‌కు వినతి





**మధురవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 15**: :మధురవాడలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో దివీస్ సంస్థ యాజమాన్యం సహకారంతో గురువారం శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాల ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, విద్యార్థులకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు సంస్థకు చెందిన కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.గతంలో దివీస్ సంస్థ సహకారంతో పాఠశాల మైదానాన్ని అభివృద్ధి చేసినప్పటికీ, ఇటీవల మైదానంలో చెత్త పేరుకుపోవడంతో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. కొత్తగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ మాత్రపు హానోక్ (మహేష్), ప్రధానోపాధ్యాయులు ఈ సమస్యను గుర్తించి, దసరా సెలవుల్లోనే పాఠశాల ఆవరణను శుభ్రం చేయించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో దివీస్ సంస్థ యాజమాన్యం స్పందించి కార్మికులను పంపడంతో శుభ్రత కార్యక్రమం ప్రారంభమైంది.

### నాలుగు పెద్ద చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని వినతి

పాఠశాలలో తగినన్ని చెత్త కుండీలు లేకపోవడంతో రోజువారీగా వ్యర్థాలు పేరుకుపోతున్నాయని పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నాలుగు పెద్ద చెత్త సేకరణ డబ్బాలను ఏర్పాటు చేయాలని కోరారు. చెత్తను క్రమబద్ధంగా సేకరించి, పాఠశాల పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

### దసరా సెలవుల్లో స్వీపర్లను కేటాయించాలని విజ్ఞప్తి

పాఠశాల మైదానాన్ని పూర్తిస్థాయిలో శుభ్రం చేయడంతో పాటు, భవిష్యత్తులోనూ పరిశుభ్రత కొనసాగించేందుకు దసరా సెలవుల సమయంలో కొంతమంది పారిశుద్ధ్య కార్మికులను కేటాయించాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు మధురవాడ జోనల్ కమిషనర్‌కు ఎస్ఎంసీ చైర్మన్ మాత్రపు హానోక్ (మహేష్), వైస్ చైర్మన్ పిల్ల స్వప్న, కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు.

### పరిశుభ్రమైన పాఠశాలే లక్ష్యం

పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే విద్యార్థుల ఆరోగ్యానికి మేలు జరగడంతో పాటు, వారిలో పారిశుద్ధ్యంపై అవగాహన పెరుగుతుందని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. దివీస్ సంస్థ అందిస్తున్న సహకారానికి తోడు, సంబంధిత అధికారుల నుంచి అవసరమైన సదుపాయాలు కల్పిస్తే పాఠశాల మైదానాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో నాలుగు పెద్ద చెత్త సేకరణ డబ్బాలు ఏర్పాటు చేయడంతో పాటు, పారిశుద్ధ్య కార్మికులను కేటాయించాలని జోనల్ కమిషనర్‌ను పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు కోరారు.

## మధురవాడలో వైభవంగా శ్రీ లలితా దేవి కుంకుమార్చనలి

శ్రీ సాయి సూర్య రెసిడెన్సీలో భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి వేడుకలులి



**మధురవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 15**: విశాఖపట్నం మధురవాడ రేవళ్లపాలెంలోని శ్రీ సాయి సూర్య రెసిడెన్సీలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం పంచమి సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ లలితా దేవికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. శ్రీ జోశ్యుల వెంకట శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేదోక్త సంప్రదాయాల ప్రకారం పూజలు జరిగాయి.రెసిడెన్సీ సభ్యులంతా ఐకమత్యంతో ఉత్సవాలను నిర్వహిస్తూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, నైవేద్యాలు సమర్పిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో శ్యాం, ఉత్తమ కుమార్, అప్పారావు, శ్రీనివాస్ యాదవ్, గణేష్, పరంకుశనాయుడు, ఏనుగుల రమేష్, పట్నాయక్ తదితరులు పాల్గొంటున్నారు.

### ఆదివారం భక్తి సంగీత కార్యక్రమం

ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు రేజేటి సతీష్ ఆధ్వర్యంలో భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

## తప్పిపోయిన ఐదేళ్ల బాలుడిని కుటుంబానికి అప్పగించిన వన్‌టౌన్ పోలీసులు



**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 15**: విశాఖపట్నంలో ఒంటరిగా తిరుగుతున్న ఐదేళ్ల బాలుడిని స్థానిక యువకులు, వన్‌టౌన్ పోలీసులు చొరవతో క్షేమంగా కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. కనకమహాలక్ష్మి ఆలయం నుంచి బీచ్‌రోడ్డుకు వెళ్లే మార్గంలో షేక్ అమాన్ అనే బాలుడు ఒంటరిగా కనిపించడంతో స్థానిక యువకులు అప్రమత్తమయ్యారు. బాలుడు సరిగా మాట్లాడలేని స్థితిలో ఉండటంతో అతడిని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు సమాచారం అందించారు.వెంటనే స్పందించిన పోలీసులు గాలింపు చేపట్టి, బాలుడు కోటవీధికి చెందినవాడిగా గుర్తించారు. అనంతరం బాలుడి తాతను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. చిన్నారి క్షేమంగా తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చిన యువకులను వన్‌టౌన్ సీఐ వరప్రసాద్ అభినందించారు. సకాలంలో స్పందించి మానవత్వం చాటిన యువకుల సేవలను కొనియాడారు.

# దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు.. 12 కొత్త హాల్టులు

దేశవ్యాప్తంగా రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే శుభవార్త అందించింది. కనెక్టివిటీని మెరుగుపరిచే లక్ష్యంతో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా 4 కొత్త రైలు సర్వీసులను ప్రారంభించేందుకు, ఇప్పటికే నడుస్తున్న 3 రైళ్లను పొడిగించేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. వీటితో పాటు, ప్రయాణికుల రద్దీ, డిమాండ్ ఆధారంగా 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్లను కేటాయించింది. ఈ మార్పులకు సంబంధించిన రైళ్ల ప్రారంభ తేదీలు, పొడిగింపు తేదీలను సంబంధిత రైల్వే జోన్లు త్వరలో వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా వెల్లడిస్తాయని అధికారులు తెలిపారు.

**కొత్తగా ఆమోదం పొందిన రైళ్లు:**

1. రాయ్‌పూర్ -- రౌఘాట్ మెమూ (68768/68769): ఈ రైలు శనివారం మినహా వారానికి 6 రోజులు నడుస్తుంది.
రౌఘాట్ నుంచి ఉదయం 6:30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1:05 గంటలకు రాయ్‌పూర్ చేరుకుంటుంది.
రాయ్‌పూర్ నుంచి మధ్యాహ్నం 1:20 గంటలకు బయలుదేరి రాత్రి 7:00 గంటలకు రౌఘాట్ వెళుతుంది.

2. హరిద్వార్ -- వెరావల్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (14326/14325): ఇది వారానికి రెండుసార్లు నడిచే సర్వీస్. ఈ రైలు హరిద్వార్ నుంచి బుధ, ఆదివారాల్లో; వెరావల్ నుంచి గురు, సోమవారాల్లో నడుస్తుంది.
హాల్టులు: రూర్కీ, ముజఫర్‌నగర్, మీరట్ సిటీ, ఘజియాబాద్, ఢిల్లీ, రేవారి, జైపూర్, అజ్మీర్, అబూ రోడ్, పాలన్‌పూర్, రాజ్‌కోట్, జునాగఢ్ వంటి ప్రధాన స్టేషన్లలో ఆగుతుంది.

3. హరిద్వార్ -- ఓఖా ఏసీ ఎక్స్‌ప్రెస్ (14328/14327): ఇది వారానికి ఒకసారి నడిచే సర్వీస్.
హరిద్వార్ నుంచి శుక్రవారం, ఓఖా నుంచి శనివారం బయలుదేరుతుంది.
హాల్టులు: రూర్కీ, మీరట్ సిటీ, ఢిల్లీ, జైపూర్, అజ్మీర్, అబూ రోడ్, రాజ్‌కోట్, జామ్‌నగర్, ద్వారకలలో ఆగుతుంది.

4. బిర్ -- ఇటార్సీ ప్యాసింజర్ (51689/51690): వారానికి ఒకసారి నడుస్తుంది.
బీర్ నుంచి శనివారం, ఇటార్సీ నుంచి ఆదివారం అందుబాటులో ఉంటుంది.



పొడిగించిన సర్వీసులు:

1. బాంద్రా (ౡ) -- ఢిల్లీ సరాయ్ రోహిల్లా గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (12216/12215): ఈ రైలును హరిద్వార్ వరకు పొడిగించారు. పొడిగింపు మార్గంలో ఢిల్లీ, ఘజియాబాద్, మీరట్ సిటీ, ముజఫర్‌నగర్, రూర్కీలలో అదనపు స్టాపులు ఉంటాయి.
2. గోండియా -- వాడ్సా మెమూ (68806): ఈ రైలును అర్మోరి వరకు పొడిగించారు.
3. వాడ్సా -- చందా ఫోర్ట్ మెమూ (68808): ఈ రైలును కూడా అర్మోరి వరకు పొడిగించారు.

**కొత్తగా కేటాయించిన హాల్టులు:**

కింది 12 రైళ్లకు కొత్తగా హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.
వల్సాడ్--వడనగర్ ఎక్స్‌ప్రెస్ (20959/20960): అంకలేశ్వర్
హతియా--హౌరా క్రియ యోగా ఎక్స్‌ప్రెస్ (18616): చకులియా
సహర్సా--అమృత్‌సర్ గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (12203/12204): పానిపట్
హైదరాబాద్--రక్సాల్ ఎక్స్‌ప్రెస్ (17005/17006): రిగా
దర్భంగా--గోమతి నగర్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ (15561/15562): రిగా
తిరుపతి--రక్సాల్ ఎక్స్‌ప్రెస్ (17433/17434): బైరగ్నియా
లౌకహా బజార్--ఆనంద్ విహార్ టెర్మినల్ స్పెషల్ (04013/04014): ఘోరసహన్
బాంద్రా (ౡ)--జైపూర్ ఎక్స్‌ప్రెస్ (22933/22934): నవ్‌సారి
అలప్పుజ--కన్నూర్ ఎక్స్‌ప్రెస్ (16307): వల్లిక్కున్ను
ఖూ= బెంగళూరు--ఎర్నాకుళం జంక్షన్ ఎక్స్‌ప్రెస్ (16377/16378): ఒట్టపాలెం
లోకమాన్య తిలక్ టెర్మినస్--పాట్లీపుత్ర ఎక్స్‌ప్రెస్ (12141/12142): గహ్మర్
సీల్దా--రాంపూర్‌హట్ ఎక్స్‌ప్రెస్ (13187/13188): బారక్‌పూర్

ఈ కొత్త సర్వీసులు, పొడిగింపులు, అదనపు హాల్టుల వల్ల పలు ప్రాంతాల మధ్య ప్రయాణ సౌకర్యం గణనీయంగా మెరుగుపడుతుందని, ప్రయాణికుల సమయం ఆదా అవుతుందని రైల్వే శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

# మనం చేసి చూపిద్దాం

భారతదేశం అనతికాలంలోనే అంతర్జాతీయ క్రీడారంగంలో తిరుగులేని శక్తిగా (గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్) ఆవిర్భవించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు-2026లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన భారత క్రీడాకారులతో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా "మనం చేసి చూపిద్దాం" అనే కొత్త నినాదంతో వారిలో స్ఫూర్తిని నింపారు. దేశంలో క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, అథ్లెట్లకు అన్ని విధాలా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.



పతక విజేతలతో భేటీ కావడం అద్భుతమైన సందర్భమని అభివర్ణించిన ప్రధాని, క్రీడాకారుల అంకితభావాన్ని, వారు సాధించిన విజయాలను కొనియాడారు. "మీరు 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు. త్రివర్ణ పతాక వైభవాన్ని చాటిచెప్పడమే మీరు సాధించిన అతిపెద్ద విజయం. లక్ష్యం పట్ల ఉన్న అభిరుచి విజయంగా రూపాంతరం చెందినప్పుడు, పతకాలతో పాటు ఆ క్రీడాకారుల ముఖాల్లో కనిపించే వర్చస్సు మీ అందరిలోనూ ప్రతిబింబిస్తోంది" అని మోదీ ప్రశంసించారు. ఈ ఘనత కేవలం క్రీడాకారులదే కాదని, దీని వెనుక కోచ్‌లు, సహాయక సిబ్బంది, కుటుంబ సభ్యులతో పాటు కోట్లాది మంది భారతీయుల ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇదే తరుణంలో, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

**చారిత్రక విజయాలపై ప్రశంసలు**

ఈసారి ఆసియా క్రీడలు భారత్‌కు ఎన్నో మైలురాళ్లను మిగిల్చాయని ప్రధాని గుర్తుచేశారు. సుదీర్ఘమైన 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ మహిళల హాకీ జట్టు స్వర్ణం కైవసం చేసుకోవడాన్ని, అలాగే పురుషుల హాకీ జట్టు కూడా పసిడి పతకంతో మెరవడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్, కబడ్డీ విభాగాల్లో భారత్ 'డబుల్ గోల్డ్స్' సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆర్చరీలో ఐదు స్వర్ణాలు, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్‌లో అథ్లెట్లు కనబరిచిన అద్భుత ప్రదర్శనలను అభినందించారు. అథ్లెటిక్స్‌లో కొత్త రికార్డులు నెలకొల్పడంతో పాటు, 28 ఏళ్ల తర్వాత వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకం, 1982 తర్వాత మారథాన్‌లో విజయం వంటి చారిత్రక ఘనతలను ఆయన ప్రస్తావించారు. భారత్ సాధించిన మొత్తం 85 పతకాలలో మహిళా అథ్లెట్లు 11 స్వర్ణాలతో కలిపి మొత్తం 38 పతకాలు సాధించడం నవభారత ఆత్మవిశ్వాసానికి, మహిళా సాధికారతకు నిదర్శనమని ప్రధాని కొనియాడారు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, సాఫ్ట్ టెన్నిస్, సెయిలింగ్ వంటి క్రీడల్లో తొలిసారిగా పతకాలు సాధించడాన్ని ప్రస్తావిస్తూ, గతంలో ప్రాతినిధ్యమే లేని క్రీడల్లోనూ నేడు భారత్ విజయకేతనం ఎగురవేస్తోందని ఆనందం వ్యక్తం చేశారు.

**క్రీడారంగానికి ప్రభుత్వ అండ**

గత దశాబ్ద కాలంగా క్రీడారంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలను మోదీ వివరించారు. ఒకప్పుడు దేశంలో క్రీడల పట్ల నెలకొన్న నైరాశ్యాన్ని అధిగమించి, నేడు నూతనోత్తేజంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. 'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్' (టాప్స్), 'ఖేలో ఇండియా' వంటి పథకాల ద్వారా పారదర్శకమైన, అత్యాధునిక క్రీడా వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా క్రీడా సమాఖ్యలను బలోపేతం చేసేందుకు, క్షేత్రస్థాయి కార్యక్రమాల కోసం సుమారు రూ.36 వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వెయ్యికి పైగా ఖేలో ఇండియా కేంద్రాలు, నూతన స్టేడియంలు, స్విమ్మింగ్ పూల్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రతిభావంతులైన అథ్లెట్లకు 'టాప్స్' కింద నెలకు రూ.50 వేల ఆర్థిక ప్రోత్సాహం అందించడంతో పాటు, విదేశాల్లో శిక్షణ పొందేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ లో రాణించడంతో పాటు 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభను వెలికితీయడానికి విస్తృతంగా 'టాలెంట్ హంట్' నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులు తమ పాఠశాలలకు, గ్రామాలకు వెళ్లి అక్కడి చిన్నారుల్లో స్ఫూర్తి నింపాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడా స్ఫూర్తి జీవితంలో ఎదురయ్యే ఏ సవాలునైనా ధైర్యంగా ఎదుర్కొనేలా మనిషిని తీర్చిదిద్దుతుందని అభిప్రాయపడ్డారు. "ఆడేవాడే ఎదుగుతాడు" అనే తన సూత్రాన్ని పునరుద్ఘాటిస్తూ, "వికసిత భారత్" లక్ష్య సాధనలో క్రీడారంగం కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని పేర్కొన్నారు.

# ఢిల్లీలో సీజేపీ నిరసన.. అడ్డుకోలేమన్న హైకోర్టు

ఎన్నికల అక్రమాల ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. అక్టోబర్ 16 (శుక్రవారం) ఢిల్లీ నడిబొడ్డున ఉన్న కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్‌లో జరగనున్న ఈ ఆందోళనను నిలువరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. నిరసనను చట్టప్రకారం నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు ఇచ్చిన హామీని కోర్టు నమోదు చేసుకుంది. దసరా పండుగ సీజన్‌లో ఈ నిరసన వల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటాయని, తద్వారా తీవ్రంగా నష్టపోతామని ఓ వీధి వ్యాపారి హైకోర్టును ఆశ్రయించారు. కన్నాట్ ప్లేస్ నిరసనలకు వేదిక కాదని, ఈ ఆందోళనను నిలిపివేయాలని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. అయితే, సీజేపీ కార్యకలాపాలను నియంత్రించేందుకు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నామని అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ కోర్టుకు విన్నవించారు. ఈ వాదనలు విన్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నితిన్ వాసుదేవ్ సాంబ్రే, జస్టిస్ సంజయ్ శర్మలతో కూడిన ధర్మాసనం, నిరసనను నిలిపివేయడానికి నిరాకరించింది. మరోవైపు, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల అక్రమాలపై గళమెత్తుతున్న విద్యార్థులు, యువతను




పోలీసులు ఈడ్చిపారేస్తున్నారని ఆరోపించారు. వారికి మద్దతుగా వచ్చిన రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ వంటి ప్రతిపక్ష నేతలను సైతం నిర్బంధించారని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ వెనకేసుకొస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేపీ పిలుపునిచ్చిన ఈ నిరసనలో తాము కూడా పాల్గొంటామని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రకటించింది. నిరసనకారులు జాతీయ జెండాలతో తరలిరావాలని దీప్కే పిలుపునిచ్చారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు స్పందిస్తూ ఎన్నికల సంఘానికి, కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 12న ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు ప్రాంగణంలో మార్చ్ నిర్వహించడంపై దాఖలైన మరో పిటిషన్‌పైనా సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా "న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు" అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ నిరసన నాటి సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని అధికారులను ఆదేశించారు.

## 'సర్' వివాదం.. 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో 'స్పెషల్ సమ్మరీ రివిజన్'..




దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) ప్రక్రియపై చెలరేగుతున్న వివాదాల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. 'సర్' నిర్వహణలో తలెత్తిన లోపాలను సరిదిద్దే లక్ష్యంతో, 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాకు "స్పెషల్ సమ్మరీ రివిజన్" (ఎస్ఎస్ఆర్) చేపట్టాలని గురువారం ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా ఓటు హక్కు పొందే యువతతో పాటు, సాంకేతిక కారణాల వల్ల జాబితాలో పేర్లు నమోదు కాని వారిని చేర్చేందుకు ఈ ప్రక్రియ దోహదపడనుంది. పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, బీహార్, తమిళనాడు వంటి కీలక రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. 2027 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. తాజా షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 12న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం 2027 జనవరి 4న తుది జాబితాను విడుదల చేస్తారు. కాగా, 2027 ఫిబ్రవరి నాటికి ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ ప్రక్రియ ప్రాధాన్యత సంతరించుకుంది.

**వివాదానికి దారితీసిన సర్**

'సర్' ప్రక్రియలో భాగంగా భారీస్థాయిలో ఓటర్ల పేర్లను తొలగించడంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా, ఫారం-6తో పాటు ఓటర్లు ఒక అదనపు డిక్లరేషన్ సమర్పించాలన్న నిబంధన వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. సుమారు 20 ఏళ్ల క్రితం జరిగిన 'సర్' వివరాలతో ప్రస్తుత దరఖాస్తుదారుల తల్లిదండ్రుల వివరాలను అనుసంధానం చేయాలని కోరడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నిబంధనలు అసంబద్ధంగా ఉన్నాయని, ఓటర్లను ఇబ్బందులకు గురిచేసేలా ఉన్నాయని ఆరోపిస్తున్నాయి. ఈ వివాదం నేపథ్యంలో 'ఇండియా' కూటమి పార్టీలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వంటి యువజన సంఘాలు ఢిల్లీలో నిరసనలు చేపట్టాయి. తక్షణమే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ఏపీ, తెలంగాణలో పరిస్థితి ఏంటి?**

ప్రస్తుతం 'సర్' ప్రక్రియ కొనసాగుతున్న లేదా ఇటీవలే పూర్తయిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో 'ఎస్ఎస్ఆర్' షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అదేవిధంగా, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇప్పటివరకు 'సర్' ప్రారంభం కాని హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలో కూడా ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను తగిన సమయంలో వెల్లడిస్తామని ఈసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. సెప్టెంబర్ 29న ఇచ్చిన ఆదేశాల మేరకు, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని రాష్ట్రాల అధికారులకు సూచించినట్లు ఈసీ గుర్తు చేసింది.

## లక్ష్యం నెరవేరింది..
## నక్సలిజం ముగిసింది



నక్సలిజం బస్తర్ ప్రాంతంలో పూర్తిగా అంతరించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలనే సంకల్పంతో ప్రధాని మోదీ 2026 మార్చి 31 గడువును విధించారని, భద్రతా బలగాల కృషితో ఆ లక్ష్యం నెరవేరిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలనకు 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా, దివ్యాంగులు, నక్సల్ బాధితులకు సాయం అందించే కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అమిత్ షా పాల్గొన్నారు. దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించడం మాత్రమే సరిపోదని ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలో కలిసిన వాళ్లు తమ జీవితాన్ని పునర్నిర్మించుకోవాలని చెప్పారు.

ఒకప్పుడు తుపాకీ మోతలు, బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన బస్తర్ ప్రాంతంలో శాంతి పవనాలు వీచాయని షా చెప్పారు. నక్సలిజంలో మిగిలిన ఆనవాళ్లను కూడా పూర్తిగా తుడిచిపెట్టి, బస్తర్‌ను ప్రశాంతమైన, అభివృద్ధి చెందిన ప్రాంతంగా మార్చడానికి కేంద్రం పట్టుదలతో ఉందన్నారు. అదే సమయంలో కాంగ్రెస్?పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఛత్తీస్‌గఢ్‌లో దశాబ్దాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ కనీసం ప్రాథమిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. కానీ, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం మాత్రం మౌలిక వసతులు, సౌకర్యాలను మెరుగుపరచడానికి నిరంతరం కృషి చేస్తోందని వెల్లడించారు. హింసాత్మక ప్రాంతాల్లో సాధారణ స్థితి, గిరిజన సంస్కృతిని పునరుద్ధరించడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో కలిసి కేంద్రం పలు చర్యలు తీసుకుంటున్నట్లు అమిత్ షా వివరించారు.

"ఐదు దశాబ్దాల పాటు నక్సలిజం ఎంతటి విధ్వంసాన్ని సృష్టించిందో, బస్తర్?లోని పేద ఆదివాసులను ఏ స్థాయిలో నష్టపరిచిందో ప్రపంచం మొత్తం ఈ గణాంకాల ద్వారా తెలుసుకోగలదు. ఏదైనా ఒక నిర్దోషి అయిన పౌరుడిని, వారి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఐఈడీ బాంబులు అమర్చి వారి చేతులు, కాళ్లు విసిరేస్తే అంతకంటే పెద్ద మానవ హక్కుల ఉల్లంఘన మరొకటి ఉండదు. నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఒక దృఢ సంకల్పం ఉంది. 2026 మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని చెప్పాం. అనుకున్నట్లుగానే ఈ రోజు దేశంలో నక్సలిజం అంతమైపోయిందని చెప్పడానికి నాకు ఎంతో ఆనందంగా ఉంది. నక్సలిజం వల్ల గత ఐదు దశాబ్దాలుగా ఆ ప్రజలు పడిన వేదనను మనం అంతం చేయలేం. ఆ బాధలు ఎవరినైతే గాయపరిచాయో, వారికి మనం ఓదార్పునివ్వాలి. వారిని నిలబెట్టేందుకు ప్రయత్నం చేయాలి. వారు ఆత్మగౌరవంతో జీవించేలా తగిన ఏర్పాట్లు చేయాలి."

**వారికి మద్దతు ఇవ్వడమే ఈ సేవా కార్యక్రమం ముఖ్యఉద్దేశం**

'సేవా సంకల్ప్? అభియాన్?' కార్యక్రమం ద్వారా దాదాపు 3,600 మందికి పైగా దివ్యాంగులు లబ్ధి పొందారని అమిత్? షా పేర్కొన్నారు. అక్టోబర్? 5 నుంచి 7 వరకు నిర్వహించిన కార్యక్రమంలో ఒక్క బస్తర్?లోనే 1,570 మంది లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా నక్సలిజం కారణంగా అంగవైకల్యానికి గురైన గిరిజనులకు కృత్రిమ అవయవాలు అందిస్తుండటం పట్ల షా సంతృప్తి వ్యక్తం చేశారు. నక్సలిజం ఐదు దశాబ్దాల పాటు ఛత్తీస్?గఢ్?ను ఎంతగా పీడించిందో అక్కడి వికలాంగుల సంఖ్యను బట్టి అంచనా వేయవచ్చునని షా పేర్కొన్నారు. నక్సలిజం వల్ల జీవితాలు ప్రభావితమైన వారికి మద్దతు ఇవ్వడమే ఈ సేవా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నొక్కి చెప్పారు. ఒకప్పుడు ఛత్తీస్?గఢ్? అభివృద్ధికి నక్సలిజం పెద్ద అడ్డంకిగా ఉండేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణు దేవ్ ?సాయి పేర్కొన్నారు. అయితే, ప్రధాని మోదీ నాయకత్వంలో నక్సలిజం నిర్మూలన దిశగా తీసుకుంటున్న చర్యలు రాష్ట్రానికి దక్కిన గొప్ప ప్రయోజనాల్లో ఒకటని అన్నారు. ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు.

## సంపాదకీయం

# రూపాయికి కవచం!

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా, అంటే దేశ ఆర్థిక, ద్రవ్య వ్యవస్థల అధిపతులు, మార్కెట్లలో అతిగా ఒడుదొడుకులు, ఊహాజనిత లావాదేవీలు చోటుచేసుకోకుండా రూపాయికి కేంద్ర బ్యాంక్ అండగా నిలుస్తుందని పునరుద్ఘాటించారు. రూపాయికి ఏదోక నిర్దిష్ట స్థాయిని, శ్రేణిని ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకోలేదని మల్హోత్రా స్పష్టం చేయగా, గత ఏడాదిన్నరలో రూపాయి "చాలా గణనీయంగా" బలహీనపడిందని, అందుకు ప్రపంచ అనిశ్చితులే కారణమని, విదేశీ మారక నిల్వలు సహా దేశ స్థూల ఆర్థిక మూలాలు బలంగా ఉన్నాయని సీతారామన్ అన్నారు. అంకెలు ఈ ఒత్తిడిని చూపుతున్నాయి. ఈ ఏప్రిల్ 1 నుంచి రూపాయి 2.8 శాతం బలహీనపడి, ప్రధాన ఆసియా ఆర్థిక వ్యవస్థల కరెన్సీల్లో రెండో అత్యంత పేలవ ప్రదర్శన కనబరిచింది; ఇదే కాలంలో ఇండోనేషియా రూపయా 6 శాతం పడి, ఆసియాలో అత్యంత బలహీన కరెన్సీగా నిలిచింది. ఈ ఏడాది ఆరంభం నుంచి లెక్కిస్తే రూపాయి 7 శాతానికి పైగా క్షీణించింది. అక్టోబర్ 10న ఆర్‌బీఐ ప్రకటించిన చర్యలు అక్టోబర్ 12 నుంచి అమల్లోకి వచ్చాయి. రూపాయి కుదురుకోవడానికి అవి సహాయపడుతున్నాయి: ఈ వారం ఇప్పటికే సుమారు 1.7 శాతం కోలుకుని, బుధవారం డాలర్‌కు 95.16 వద్ద, ఒక నెలలో అత్యధిక స్థాయిలో ముగిసింది. ఇండియన్ ఆయిల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ అనే మూడు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీల రోజువారీ డాలర్ అవసరాలన్నింటినీ తీర్చేందుకు ఆర్‌బీఐ ప్రత్యేక కిటికీని తెరిచింది; ఇది తదుపరి ఆదేశాల వరకు కొనసాగుతుంది. రద్దయిన విదేశీ మారక డెరివేటివ్ ఒప్పందాలను మళ్లీ బుక్ చేయడంపై ఆంక్షలు విధించింది; అంతర్లీన లావాదేవీ లేకుండా చేసే ఒప్పందాల పరిమితిని తగ్గించింది; అర్హత గల డెరివేటివ్ ఒప్పందాల కోసం 'ఫారిన్ ఎక్స్ఛేంజ్ రిస్క్ రిజర్వ్' (ఎఫ్ఈఆర్ఆర్) పేరుతో కొత్త నగదు నిల్వ అవసరాన్ని ప్రవేశపెట్టింది, అంటే 20 శాతం నగదు రిజర్వ్, నిర్దిష్ట పరిమితికి మించిన ఒప్పందాలకు. సోమవారం రాత్రి విడుదల చేసిన మరో సర్క్యులర్‌లో, నివాసేతరులకు అందించే రూపాయి నాన్-డెలివరబుల్ డెరివేటివ్‌లను కేవలం హెడ్జింగ్‌కు మాత్రమే పరిమితం చేసింది, బ్యాంకుల సొంత హెడ్జింగ్ ఒప్పందాలకు కూడా ఎఫ్ఈఆర్ఆర్‌ను విస్తరించింది.

ఈ చర్యలు సహేతుకమైనవే. ఊహాజనిత లావాదేవీల ఖర్చు పెంచడం, చమురు కంపెనీల భారీ డాలర్ డిమాండ్‌ను స్పాట్ మార్కెట్ నుంచి వేరు చేయడం ద్వారా ఆర్‌బీఐ మార్కెట్లలో క్రమశిక్షణ తెచ్చింది. అంచనాలు ఏకపక్షంగా, అంటే రూపాయి నిరంతరం పడిపోతుందనే నమ్మకంతో, మారినప్పుడు ఇలాంటి చర్యలు అవసరమవుతాయి. కానీ ఇక్కడ ఒక జాగ్రత్త అవసరం. కరెన్సీ నష్టాల నుంచి తమను తాము రక్షించుకుంటున్న వ్యాపారాలను, మరింత క్షీణత భయంతో హెడ్జ్ చేస్తున్నారన్న కారణంతో, ఊహాజనిత వ్యాపారులుగా చూడకూడదు. నిబంధనలు కఠినమైనప్పుడు నిజమైన హెడ్జర్లకు అదనపు ఖర్చు, పత్రాల భారం పడే ప్రమాదం ఉంది. ఈ చర్యల ప్రభావం బ్యాంకులపైనా పడుతోంది: బ్యాంకుల సొంత హెడ్జింగ్ ఒప్పందాలకు కూడా నగదు నిల్వ నిబంధన విస్తరించడం ద్రవ్యలభ్యతపై ఆందోళనలకు దారితీసిందని నివేదికలు చెబుతున్నాయి. అదే సమయంలో, మార్కెట్లు ఇప్పుడు వచ్చే 12 నెలల్లో దాదాపు 100 బేసిస్ పాయింట్ల వడ్డీ రేట్ల పెంపును అంచనా వేస్తున్నాయి. అదనపు చర్యలకూ సిద్ధంగా ఉన్నామని మల్హోత్రా చెప్పగా, ఆర్‌బీఐ మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉందని సీతారామన్ అన్నారు. ఇది కొత్తేం కాదు. 2013లో రూపాయి కనిష్ఠానికి (డాలర్‌కు 68.85) పడినప్పుడు కూడా ఆర్‌బీఐ ఇదే తరహాలో చమురు కంపెనీలకు ప్రత్యేక స్వాప్ కిటికీ తెరిచింది; అవి రూపాయిని తాత్కాలికంగా కుదుటపరిచాయి. కానీ అవి సమస్య మూలాలను తొలగించలేదు, అప్పటి పరిస్థితికి కారణమైన కరెంట్ ఖాతా లోటు, ఎగుమతుల బలహీనత వంటి నిర్మాణాత్మక అంశాలు మరో రూపంలో తిరిగి వచ్చే ప్రమాదం ఉంది. ఆర్‌బీఐ చర్యలు రూపాయికి తాత్కాలిక కవచం మాత్రమే, ఎందుకంటే అసలు ఒత్తిడి దేశంలో కంటే బయటి నుంచి, ముఖ్యంగా చమురు నుంచి వస్తోంది.

ఆ నేపథ్యాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. పశ్చిమాసియా యుద్ధం, హర్మూజ్ జలసంధిలో ఆంక్షలు, నౌకలపై దాడులు, హూతీల దాడులతో బ్రెంట్ ముడిచమురు ధర ఈ వారం బ్యారెల్‌కు 106 డాలర్లకు పైగా చేరింది. భారత్ తన ముడిచమురు అవసరాల్లో 80 శాతానికి పైగా దిగుమతి చేసుకుంటుంది; ప్రతి డాలర్ పెరుగుదల వార్షిక దిగుమతి బిల్లును సుమారు రెండు బిలియన్ డాలర్లు పెంచుతుందని అంచనా. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ముడిచమురు దిగుమతుల బిల్లు 61 శాతం పెరిగి 49.8 బిలియన్ డాలర్లకు, ఏప్రిల్-ఆగస్టులో 48 శాతం పెరిగి 74.8 బిలియన్ డాలర్లకు చేరింది. అంటే డాలర్లకు డిమాండ్ నిర్మాణాత్మకంగా పెరిగింది. ఈ ఒత్తిడిలో విదేశీ మారక నిల్వలు వరుసగా నాలుగు వారాలు తగ్గి, అక్టోబర్ 2 నాటికి 734.6 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, ద్రవ్యోల్బణం కూడా ఎగబాకుతోంది: సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.54 శాతానికి, ఆహార ద్రవ్యోల్బణం 7.74 శాతానికి చేరింది, ఉల్లి ధరలు రెట్టింపయ్యాయి; ఇది 22 నెలల గరిష్ఠం, వరుసగా నాలుగో నెల ఆర్‌బీఐ 4 శాతం లక్ష్యానికి పైన ఉంది. 2026-27కు ఆర్‌బీఐ ద్రవ్యోల్బణ అంచనా 5.2 శాతం, వృద్ధి అంచనా 7.1 శాతం; డిసెంబర్‌లో మరో రేట్ల పెంపు ఉండవచ్చని హెచ్ఎస్‌బీసీ అంచనా వేస్తోంది. అందుకే ఆర్‌బీఐ చర్యలు, శాశ్వత ఆర్థిక సంస్కరణలతో కలిసి సాగాలి. ప్రభుత్వం ఇంధన దిగుమతులపై ఆధారాన్ని తగ్గించే చర్యలను వేగవంతం చేయాలి: పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహనాలు, దేశీయ చమురు, గ్యాస్ ఉత్పత్తి, వ్యూహాత్మక నిల్వలు. ఎగుమతుల పోటీతత్వాన్ని పెంచి, వాణిజ్య ఒప్పందాల ద్వారా కొత్త మార్కెట్లను తెరిచి, డాలర్ ఆదాయాన్ని పెంచుకోవాలి. దీర్ఘకాలిక ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులపై ఆధారపడాలి. ఇంధన ధరల భారాన్ని తగ్గించేందుకు సబ్సిడీలు, పన్నులపై తీసుకునే నిర్ణయాలు ఆర్థిక క్రమశిక్షణను దెబ్బతీయకుండా ఉండాలి; ద్రవ్య లోటును అదుపులో ఉంచాలి, ఎందుకంటే ప్రభుత్వ ఆర్థిక స్థితిపై అనుమానాలు కరెన్సీపై ఒత్తిడిని పెంచుతాయి. స్వల్పకాలంలో ఆర్‌బీఐ కవచం రూపాయిని కాపాడగలదు, కానీ దీర్ఘకాలంలో రూపాయి బలాన్ని నిర్ణయించేది దేశ ఆర్థిక మూలాలే. కవచం తాత్కాలికమని, సంస్కరణలే శాశ్వత రక్షణ అని పాలకులు గుర్తిస్తేనే ఈ ఒత్తిడి నుంచి దేశం బలంగా బయటపడుతుంది.

# మోదీ ముందు.. 10 సవాళ్లు!?



నరేంద్ర మోదీ -ప్రభుత్వాధినేతగా పాతికేళ్లు పూర్తి చేసుకున్నారు. పేదల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలు, కోవిడ్ సంక్షోభంలో దేశాన్ని ఏకం చేయడం, స్వదేశీ టీకా అభివృద్ధికి మద్దతు, జీ-20, బ్రిక్స్ వేదికల్లో ఏకాభిప్రాయం, గ్లోబల్ సౌత్ తరఫున గళం, 2016 సర్జికల్ స్ట్రైక్స్, 2019 బాలాకోట్, 2025 ఆపరేషన్ సిందూర్ వంటి అంశాల తీర్మానాలను ఆమోదిస్తూ కేంద్ర మంత్రివర్గం ఆయనకు అభినందనలు తెలిపింది. ఆ తీర్మానం -60 కోట్ల బ్యాంకు ఖాతాలు, 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తేవడాన్నీ ఉదహరించింది. నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధాని పదవి చేపట్టిన నేత ఆయనే. అయితే మూడో పర్యాయం సవాళ్లు పెరిగే, అసమ్మతి గళాలు బలపడే, ప్రతి నిర్ణయాన్నీ విస్తృతంగా పరిశీలించే సమయం. ఎన్నికల సంఘం విశ్వసనీయతపై ప్రశ్నలు పెరుగుతున్నాయి; ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ప్రధాన కమిషనర్ నిర్ణయాలపై అభ్యంతరాలు నమోదు చేసినట్టు నివేదికలు వచ్చాయి; ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ ఢిల్లీ సహా పలు నగరాల్లో నిరసనలు జరుగుతున్నాయి. ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం, అధికార పార్టీ ఖండిస్తున్నాయి. అలాగే -ఆర్థిక వ్యవస్థ, జీడీపీ గణాంకాల విశ్వసనీయత. కొత్త సిరీస్ ప్రకారం 2026-27 తొలి త్రైమాసిక వృద్ధి 7.8 శాతంగా వెల్లడైంది, ఇది ఆర్‌బీఐ అంచనా 7 శాతానికి మించింది. కానీ మాజీ ఆర్థిక కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ వంటి వారు ఈ లెక్కలను ప్రశ్నించగా, మాజీ ముఖ్య గణాంకవేత్త ప్రణబ్ సేన్ కొత్త సిరీస్ "స్మెల్ టెస్ట్" నెగ్గలేదన్నారు. ప్రభుత్వ గణాంక శాఖ మాత్రం సవరణలకు కొత్త సమాచారం, మెరుగైన వనరులు, కొత్త అంచనా పద్ధతులే కారణమని వివరించింది; పాత, కొత్త సిరీస్‌లను నేరుగా పోల్చడం సరికాదని కొందరు విశ్లేషకులు చెబుతున్నారు. మూడోది -ద్రవ్యోల్బణం, రూపాయి. సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.54 శాతానికి, ఆహార ద్రవ్యోల్బణం 7.74 శాతానికి చేరింది; రూపాయి ఈ ఏడాది 7 శాతానికి పైగా క్షీణించి, ఆర్‌బీఐ ప్రత్యేక చర్యలు తీసుకునేలా చేసింది. ఇక నాలుగో సవాల్ -రాజకీయ ప్రతిపక్షాలు. రాహుల్ గాంధీ దూకుడు, ఎస్ఐఆర్‌పై ఉద్యమాలు ప్రభుత్వానికి ఇబ్బందులు పెంచాయి. ఐదోది యువత. నీట్ వివాదాల తర్వాత విద్యార్థులు వీధుల్లోకి వచ్చి, వారాల తరబడి జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపి, కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జులై 25న రాజీనామా చేసేలా చేశారు. ఆరోది ఎన్డీయే అంతర్గత రాజకీయాలు. బిహార్‌లో చిరాగ్ పాశ్వాన్ శాంతిభద్రతలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించగా, ఓం ప్రకాష్ రాజ్‌భర్ ఉత్తరప్రదేశ్ విభజన ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. దీనికి యోగి ఆదిత్యనాథ్ వ్యతిరేకంగా ఉన్నారని నివేదికలు చెబుతున్నాయి. ఏడోది ప్రభుత్వ ఇమేజ్. ఒకప్పుడు నిర్ణయాత్మకంగా కనిపించిన ప్రభుత్వం, డీలిమిటేషన్‌ను ముందుకు తీసుకెళ్లడంపైనా, ఇథనాల్ విధానంపైనా నెలల తరబడి గందరగోళంలో ఉందన్న అభిప్రాయం పెరుగుతోంది. ఎనిమిదోది మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ. ఖాళీలు భర్తీ కావడంలో జాప్యం ఉంది; విద్యా శాఖ ప్రధాన్ రాజీనామా తర్వాత ప్రహ్లాద్ జోషికి అదనపు బాధ్యతగానే ఉంది. జీఎస్టీ మండలి సమావేశం తర్వాత విస్తరణ ఉండొచ్చని సంకేతాలు వచ్చాయి. తొమ్మిదో సవాల్ పెట్టుబడులు, మధ్యతరగతి. అమెరికా, యూరప్, జపాన్‌వంటి చోట్ల మార్కెట్లు రికార్డులు సృష్టిస్తుండగా, భారత మార్కెట్లు ఒత్తిడిలో ఉన్నాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు ఈ ఏడాది ఇప్పటివరకు రికార్డు స్థాయిలో సుమారు 3.08 లక్షల కోట్ల రూపాయల ఈక్విటీలు అమ్మారు, గత ఏడాది కంటే దాదాపు రెట్టింపు. వరుసగా ఎనిమిది వారాల పతనం 25 ఏళ్లలో అత్యంత సుదీర్ఘమని నివేదికలు చెప్పాయి; ఈ నష్టాలు సిప్‌ల ద్వారా కష్టార్జితాన్ని పెట్టుబడి పెట్టిన కోట్లాది మధ్యతరగతి కుటుంబాలను తాకుతున్నాయి. పదో సవాల్ -అంతర్జాతీయ సంబంధాలు. ట్రంప్ రెండో పదవీకాలంలో భారత వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి ప్రశ్నార్థకమైంది; వాణిజ్య ఒప్పందం ఎడతెగకుండా సాగుతోంది; ఉక్రెయిన్, పశ్చిమాసియా యుద్ధాలు, ఇంధన సంక్షోభం, పాకిస్తాన్‌తో సంబంధాలు ఒత్తిడి పెంచుతున్నాయి. బంగ్లాదేశ్, నేపాల్, మాల్దీవులు, శ్రీలంకల్లో భారత ప్రభావం తగ్గిందని కొందరు నిపుణులు అంటున్నారు. అయితే ప్రభుత్వ మద్దతుదారులు భిన్నంగా వాదిస్తారు: ప్రపంచ బ్యాంకు భారత్‌ను అతివేగంగా ఎదుగుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా అంచనా వేస్తోంది, ఆర్‌బీఐ ఈ ఏడాది వృద్ధి అంచనాను 7.1 శాతానికి పెంచింది, ప్రపంచ అనిశ్చితుల మధ్య ఈ సవాళ్లు ఏ ప్రభుత్వానికైనా తప్పవు.

ఈ పది సవాళ్లకు తోడు, సాంకేతిక ప్రగతి ఎంత వేగంగా సాగుతున్నా, సామాన్యుడికి రోజూ తగులుతున్న మరో ముప్పు మాత్రం అదుపులోకి రావడం లేదు: ఆన్‌లైన్ మోసాలు. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ) ఉన్న దేశంలో, క్షణాల్లో డబ్బు కదిలే ఆ వేగమే మోసగాళ్లకు ఆయుధంగా మారింది. జాతీయ సైబర్ నేర నివేదిక పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) గణాంకాల ప్రకారం, 2021 నుంచి 2025 వరకు 65 లక్షలకు పైగా ఆర్థిక మోసాల ఫిర్యాదులు నమోదయ్యాయి, నష్టపోయిన మొత్తం 55వేల కోట్ల రూపాయలకు పైమాటే. కానీ నమోదైన ఎఫ్ఐఆర్‌లు కేవలం 1.96 లక్షలు, అంటే ఫిర్యాదుల్లో సుమారు 3 శాతం; స్తంభింపజేసిన (లియెన్) మొత్తం 8,189 కోట్లు, అంటే దాదాపు 15 శాతం. ఈ ఏడాది జూన్ 30 నాటికి 32.8 లక్షల ఫిర్యాదుల్లో 11,158 కోట్ల రూపాయలను కాపాడగలిగామని ప్రభుత్వం చెబుతోంది, ఇది ప్రశంసనీయమే, కానీ నష్టంతో పోలిస్తే చాలా తక్కువ. టెక్నాలజీ ఇంతగా ముందుకెళ్లినా వీటిని ఎందుకు అదుపు చేయలేకపోతున్నాం? కారణాలు అనేకం: మోసపు సొమ్ము చేతులు మారే 'మ్యూల్' బ్యాంకు ఖాతాలను సకాలంలో గుర్తించలేకపోవడం; కంబోడియా, మయన్మార్, లావోస్‌వంటి విదేశాల నుంచి నడిచే నెట్‌వర్కులను (కొన్ని అంచనాల ప్రకారం ఫిర్యాదుల్లో 45 శాతం విదేశీ మూలాలవి, ఇది నిర్ధారణ కాని అంచనా) పట్టుకోవడంలో సరిహద్దు, అధికార పరిమితులు; బ్యాంకులు, టెలికాం సంస్థలు, ప్లాట్‌ఫామ్‌ల జవాబుదారీతనం తగినంత లేకపోవడం; ఫిర్యాదు చేసేలోపే డబ్బు మాయమయ్యేంత వేగం; పోలీసు సిబ్బంది, సాంకేతిక నైపుణ్యాల కొరత; ఏఐ డీప్‌ఫేక్‌ల వంటి కొత్త ఆయుధాలు. పరిష్కారం కూడా ఒక్కటే కాదు: అనుమానాస్పద లావాదేవీలపై బ్యాంకుల్లో తక్షణ నిరోధక వ్యవస్థలు, మ్యూల్ ఖాతాలను గుర్తించే నిజ-సమయ సాంకేతికత, మోసం జరిగితే సేవా సంస్థలకూ బాధ్యత, అంతర్జాతీయ సహకారం, ఫిర్యాదుల నుంచి ఎఫ్ఐఆర్, రికవరీ వరకు వేగవంతమైన ప్రక్రియ, ప్రజల్లో అవగాహన. ఇది కేవలం నేర నియంత్రణ అంశం కాదు, ప్రజల నమ్మకానికి సంబంధించినది. డిజిటల్ ఇండియా విజయగాథ నిలవాలంటే, ప్రజలు తమ డబ్బు, గుర్తింపు, ఓటు, గణాంకాలు సురక్షితమని నమ్మగలగాలి. పాతికేళ్ల ప్రయాణం ఘనతే, కానీ ఈ ప్రయాణంలో ఎదురవుతున్న ప్రశ్నలకు పారదర్శకత, జవాబుదారీతనం, నిర్ణయాత్మక చర్యలతో సమాధానం చెప్పగలిగినప్పుడే, ఈ మైలురాయి నిజంగా విజయ వేడుకగా నిలుస్తుంది! ■

## పనికొచ్చే పలుకు



# కోటీశ్వరుల అలవాట్లు రీల్స్‌లో కాదు, రొటీన్స్‌లో

"ఈ ఒక్క ట్రిక్‌తో ఆరు నెలల్లో కోటీశ్వరుడు అవ్వండి!" థంబ్‌నెయిల్‌లో కారు పక్కన నిలబడిన అన్న, కింద "లింక్ బయోలో ఉంది". చూసినవాడు "ఇదేదో బాగుందే" అనుకుంటాడు. కానీ నిజమైన కోటీశ్వరులు రీల్ తీసే టైమ్‌లో ఏం చేస్తారో తెలుసా? చాలామంది ఆర్థిక నిపుణులు చెప్పే ఆ అలవాట్లు చాలా బోరింగ్‌గా ఉంటాయి. అందుకే అవి వైరల్ అవ్వవు.

పుస్తకాలు, ఉదయం నిద్ర లేవడం: ఎక్కువ చదివేవారికి కొత్త ఆలోచనలు, తప్పులను ముందే గుర్తించే సామర్థ్యం పెరుగుతాయి. ఉదయాన్నే లేచేవారికి ఫోన్ నోటిఫికేషన్లు రాకముందే ఒక గంట సొంతంగా దొరుకుతుంది. ఆ గంటలో నేర్చుకోండి, ప్లాన్ చేయండి, వ్యాయామం చేయండి. ఇదేం మ్యాజిక్ కాదు, రోజువారీ అలవాటు.

ముందు పొదుపు, తర్వాత ఖర్చు: చాలామంది నెలాఖరులో మిగిలినది పొదుపు చేద్దాం అనుకుంటారు. కానీ ఎప్పుడూ ఏమీ మిగలదు. అందుకే జీతం రాగానే ముందు పొదుపు/పెట్టుబడికి వేరు చేయండి, మిగిలినదే ఖర్చు చేయండి. సంపాదన కంటే తక్కువ ఖర్చుతో బతకడమంటే పిసినారితనం కాదు, భవిష్యత్తుకు స్థలం ఇవ్వడం.

చక్రవడ్డీ, నెమ్మదిగా పనిచేసే పవర్: ఇదొక ఊహాత్మక ఉదాహరణ (హామీ కాదు). నెలకు రూ.5వేల చొప్పున 20 ఏళ్లు పెట్టుబడి పెట్టి, ఏటా సగటున 10 శాతం రాబడి వచ్చిందనుకుంటే, సుమారు రూ.38 లక్షలవుతుంది. మీరు పెట్టింది మాత్రం రూ.12 లక్షలే. మిగిలినది సమయం, చక్రవడ్డీ చేసిన పని. కానీ ఇక్కడ ఒక షరతు, ఆగకుండా, ఏళ్ల తరబడి కొనసాగించాలి. మార్కెట్ రాబడులు ఏటా మారొచ్చు. నష్టాల సంవత్సరాలూ ఉంటాయి. అందుకే ఓపిక ముఖ్యం.

లెక్క చూసుకోవడం: ఆదాయం, ఖర్చులు, పెట్టుబడులను నెలకు ఒకసారి చూసుకోండి. ఇది పది నిమిషాల పని. ఎక్కడ డబ్బు లీక్ అవుతోందో, ఏ సబ్‌స్క్రిప్షన్ అనవసరమో అప్పుడే తెలుస్తుంది. లెక్క చూడనివాడికి బ్యాలెన్స్ ఎప్పుడూ ఆశ్చర్యమే.

ఈ అలవాట్లు లైఫ్‌స్టయిల్‌ను ఎలా మారుస్తాయి?

ఈ చిన్న అలవాట్లు కలిస్తే ఒత్తిడి తగ్గుతుంది, ఎందుకంటే అత్యవసరం వస్తే చేతిలో డబ్బు ఉంటుంది. అనవసర షాపింగ్ తగ్గుతుంది. "ఇంకా కావాలి" అనే కోరిక కంటే "ఇది నాకు నిజంగా అవసరమా?" అనే ప్రశ్న ముందుకొస్తుంది. భవిష్యత్తు గురించి భయం బదులు నియంత్రణ ఉన్నట్టు అనిపిస్తుంది.

అన్నీ ఒకేసారి వద్దు. ఈ నెల ఒక్కటే ఎంచుకోండి. ఉదాహరణకు జీతం రాగానే చిన్న మొత్తాన్ని పొదుపుకు మళ్లించే ఆటో-ట్రాన్స్‌ఫర్ పెట్టుకోండి, లేదా రోజూ ఇరవై పేజీలు చదవండి. పెట్టుబడి విషయంలో ఏదైనా కొత్తది మొదలుపెట్టేముందు, మీ పరిస్థితికి సరిపోయేదేనా? అని అర్హత గల ఆర్థిక సలహాదారుతో ఒకసారి చర్చించండి.

రీల్స్ ఆరు వారాల్లో కోటీశ్వరుడిని చేస్తాయని చెబుతాయి. కానీ నిజమైన సంపద ఆరు వారాల్లో కాదు, ఆరు, పదహారు, ఇరవై ఏళ్ల రొటీన్‌లో తయారవుతుంది. కాబట్టి లింక్ క్లిక్ చేయడం ఆపి, ఈ రోజే ఒక్క అలవాటు మొదలుపెట్టండి. రేపటి మీరు మీకు థ్యాంక్స్ చెబుతారు.



ఇంట్లో తలుపు తట్టే చప్పుడు వినిపిస్తే, ఎవరో తెలిసే వరకు మనసు కాస్త ఉలిక్కిపడుతుంది కదా? ఫోన్‌కు వచ్చే ప్రతి నోటిఫికేషన్ కూడా అలాంటి తలుపు చప్పుడే. చూసేలోపే "ఏం వచ్చిందో" అనే ఉత్కంఠ మొదలవుతుంది. రోజులో వందసార్లు ఇలా జరిగితే, మనసు నిరంతరం అప్రమత్తంగా, అలసటగా మారి, ఏకాగ్రత, నిద్ర దెబ్బతినవచ్చు. పని మధ్యలో వచ్చే ఒక్క నోటిఫికేషన్ కూడా మీ దృష్టిని చెదరగొట్టి, మళ్లీ పూర్తి ఏకాగ్రత రావడానికి సమయం తీసుకుంటుంది. అందుకే అనవసర నోటిఫికేషన్లను ఆపేయండి, ముఖ్యమైనవే ఉంచండి. మీ ఫోన్ మీకు సేవ చేయాలి, మీరు ఫోన్‌కు కాదు; ప్రశాంతత మీ ఎంపిక.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# రోడ్డెక్కిన మహా 'గుమ్మడి'



అమెరికాలోని నార్త్ కరోలినా కేరీలో 'ఫిలిప్స్ ఫామ్స్' వార్షిక 'పంప్కిన్‌ఫెస్ట్' జరుగుతుండగా, ఇల్లంత పరిమాణంలో ఉన్న ఒక భారీ గాలి గుమ్మడికాయ గాలి ఉద్ధృతికి కట్లు తెంచుకుని రోడ్డుపై దొర్లుకుంటూ పరుగందుకుంది! "అది మన కారును తగులుతుంది!" అంటూ కారులో ఉన్నవారు అరుస్తుంటే, ఒక ఉబర్ డ్రైవర్ కారును రివర్స్ చేశాడు. చివరికి ఆ డ్రైవర్, ఇతర స్థానికులు కలిసి దాన్ని ఆపి, గాలి తీసి ఫామ్‌కు చేర్చారు. "పంప్కిన్‌ఫెస్ట్ ఈసారి కొంచెం 'ఆఫ్ కిల్టర్' అయింది, కానీ గుమ్మడికాయను దొర్లనిచ్చి అద్భుతమైన ఆదివారం గడిపాం" అని ఫామ్ సరదాగా పోస్ట్ చేసింది. సాయం చేసినవారికి ఉచిత టికెట్లు కూడా ఇచ్చారు!

## స్పోర్ట్స్

## టీమిండియా స్టార్ ఓపెనర్ సంచలన నిర్ణయం..

# 17 ఏళ్ల కెరీర్‌కు గుడ్‌బై

భారత మహిళా క్రికెట్ జట్టు సీనియర్ బ్యాటర్ పూనమ్ రౌత్ సంచలన నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ క్రికెట్‌కు పూనమ్ రిటైర్మెంట్ ప్రకటించింది. 17 ఏళ్ల అద్భుత ప్రయాణానికి తెరదించుతూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆమె తన నిర్ణయాన్ని వెల్లడించింది. దేశం తరఫున అత్యున్నత స్థాయిలో ప్రాతినిధ్యం వహించడం తనకు దక్కిన అరుదైన గౌరవమని ఆమె పేర్కొంది. తన ఈ సుదీర్ఘ ప్రయాణంలో మద్దతుగా నిలిచిని ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని తన రిటైర్మెంట్ నోట్‌లో ఆమె రాసుకొచ్చింది. 2009లో అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగు పెట్టిన పూనమ్.. తన కెరీర్‌లో 112 మ్యాచ్‌లు ఆడింది. 37 ఏళ్ల పూనమ్ రౌత్ మూడు ఫార్మాట్లలో కలిపి మూడు వేలకు పైగా పరుగులు సాధించింది. ముఖ్యంగా 2017 ఐసీసీ మహిళల వన్డే ప్రపంచ కప్‌లో ఆమె అద్భుతమైన ప్రదర్శన చేసింది. ఈ టోర్నీలో మొత్తం ఆమె 381 పరుగులు పరుగులు చేసింది. లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కూడా 86 పరుగుల అద్భుత ఇన్నింగ్స్ ఆడింది. ఆమె చివరిసారిగా 2021లో ఆస్ట్రేలియా మహిళలతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో భారత్ తరఫున బరిలోకి దిగింది.

**క్రీడాస్ఫూర్తికి ప్రతీక**

2021లో ఆస్ట్రేలియాతో జరిగిన చారిత్రాత్మక పింక్-బాల్ టెస్ట్ మ్యాచ్‌లో ఆమె క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకుంది. బంతి బ్యాట్‌ను తాకినా అంపైర్ నాటౌట్ ప్రకటించినప్పటికీ, తాను ఔట్ అయ్యానని భావించి ఆమె స్వయంగా మైదానం వీడి వెళ్లిపోయింది. దీంతో ప్రత్యర్థి జట్టు ప్లేయర్లు సైతం ఆమె నిజాయితీకి ఫిదా అయిపోయారు. కాగా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన పూనమ్ ఇక కోచ్‌గా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశముంది.



## రుతురాజ్ రీఎంట్రీ

రంజీ ట్రోఫీ 2026-27 సీజన్‌లో రెండో రౌండ్ మ్యాచ్‌కు మహారాష్ట్ర జట్టును ప్రకటించారు. స్టార్ బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ తిరిగి జట్టులోకి వచ్చాడు. రెగ్యులర్ కెప్టెన్ అయిన రుతురాజ్ జట్టులోకి వచ్చినా కెప్టెన్సీ బాధ్యతలను మాత్రం పృథ్వీ షాకే అప్పగించారు. సర్వీసెస్‌తో జరిగిన తొలి మ్యాచ్‌కు రుతురాజ్ అందుబాటులో లేని (భారత-ఏ జట్టుకు ప్రాతినిధ్యం) నేపథ్యంలో షాకు తాత్కాలిక కెప్టెన్‌గా బాధ్యతలు అప్పజెప్పారు. ఆ మ్యాచ్‌లో సర్వీసెస్‌పై మహారాష్ట్ర 127 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో షా కెప్టెన్‌గానే కాకుండా ఆటగాడిగానూ రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

**మరింత పటిష్టంగా మారిన మహారాష్ట్ర బ్యాటింగ్**

రుతురాజ్ రాకతో మహారాష్ట్ర బ్యాటింగ్ విభాగానికి మరింత బలం చేకూరింది. ఇప్పటికే పృథ్వీ షా, దివిజయ్ పాటిల్, అంకిత్ బావ్నే, హర్షల్ కాటే, సిద్ధేశ్ వీర్, ముకేశ్ చౌదరి, రాజవర్ధన్ హంగర్గేకర్, విక్కీ ఓత్స్వాల్, సౌరభ్ నవలే తదితరు బ్యాటర్లు జట్టులో కొనసాగుతున్నారు. మహారాష్ట్ర-ఝార్ఖండ్ మ్యాచ్ అక్టోబర్ 18 నుంచి 26 వరకు పుణేలో జరగనుంది.




## ఆఫ్ఘన్ ప్లేయర్‌పై ఐసీసీ చర్యలు




ఆఫ్ఘనిస్తాన్ వికెట్ కీపర్ బ్యాటర్ అఫ్సర్ జజాయ్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. బంగ్లాదేశ్‌తో అబుదాబిలో జరిగిన ఏకైక టెస్టు సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించినందుకు అతడిని అధికారికంగా మందలించింది. అతడి క్రమశిక్షణ రికార్డులో ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా చేర్చింది. బంగ్లాతో మ్యాచ్‌లో అఫ్సర్ ఆఫ్ఘన్ జట్టుకు 12వ ఆటగాడిగా వ్యవహరించాడు. ఈ సమయంలో మైదానంలోకి రావద్దని, ఆట ఆలస్యమయ్యేలా చేయవద్దని అంపైర్లు పలుమార్లు సూచించినా అతడు పట్టించుకోలేదు. ఓ దశలో అంపైర్ల అనుమతి లేకుండా మైదానంలోకి ప్రవేశించాడు. దీంతో అంపైర్ అతడిపై ఐసీసీకి ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన ఐసీసీ అఫ్సర్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. అంతర్జాతీయ మ్యాచ్‌లో అంపైర్ ఆదేశాలను పాటించకపోవడం ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.4 ఉల్లంఘన కిందికి వస్తుంది.

**అఫ్సర్ జజాయ్ ఎవరు..?**

అఫ్సర్ జజాయ్ కుడిచేతి వాటం వికెట్ కీపర్ బ్యాటర్. ఆఫ్ఘనిస్తాన్ తరఫున మూడు ఫార్మాట్లలోనూ ప్రాతినిధ్యం వహించాడు. 2018 జూన్‌లో భారత్‌తో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లోనూ అతడు పాల్గొన్నాడు. 16 ఏళ్ల వయసులో ఆఫ్ఘన్ అండర్-19 జట్టులో చోటు దక్కించుకున్న జజాయ్.. 2010, 2012 అండర్-19 ప్రపంచకప్‌లలోనూ ఆడాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటివరకు 10 టెస్టులు ఆడిన జజాయ్ 378 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ ఉంది. 17 వన్డేల్లో 264 పరుగులు, ఎనిమిది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 141 పరుగులు సాధించాడు. ఇదిలా ఉంటే, అబుదాబీ వేదికగా ఆఫ్ఘనిస్తాన్-బంగ్లాదేశ్ మధ్య జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆఫ్ఘన్ ప్లేయర్లు అద్భుతంగా పోరాడి ఓటమి తప్పించుకున్నారు. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 346, 372-7 స్కోర్లు చేయగా.. ఆఫ్ఘనిస్తాన్ 240 మరియు 346-8 స్కోర్లు చేసింది.



అమృత అయ్యర్ అద్భుతమైన పచ్చ ఆకుపచ్చ దుస్తులలో సొగసైనదిగా కనిపిస్తుంది

## మమితా బైజు టాలీవుడ్ లో

# మరో ఛాన్స్!

-ప్రేములు-తో యువత హృదయాలను కొల్లగొట్టిన అందాల భామ మమితా బైజు సౌత్ ఇండియన్ చిత్రసీమలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోతుంది. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో, సహజమైన నటనతో అభిమానులను సంపాదిం చుకున్న యంగ్ సెన్సేషన్ టాలీవుడ్‌లో దూకుడు పెంచారు. ఇప్పటికే టాలీవుడ్‌లో విశ్వనాథ్ అండ్ సన్స్ లో నటించిన అమ్మడు తాజాగా మరో భారీ అవకాశం అందుకుందని ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం సాగుతోంది.ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ (గాఎజఖ) నుంచి రాబోతున్న ప్రతిష్టాత్మక పాన్-ఇండియా చిత్రం -జై హనుమాన్- లో మమితా బైజు కీలక పాత్రలో ఎంపికైందనే వార్తలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొని ఉండగా ఇందులో రిషబ్ శెట్టి హనుమంతుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో మమిత భాగమైతే.. అమ్మడి కెరీర్‌కు ఇది బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్ కావడం ఖాయం.



**అయితే టాలీవుడ్‌లో మమితా బైజు హడావుడి ఇక్కడితో ఆగిపోలేదు.**

తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ య్యేందుకు సొగసరి వరుసగా పెద్ద ప్రాజెక్ట్‌లను లైన్‌లో పెడుతున్నారు. కొత్త ప్రాజెక్ట్ లకు సంబంధించి జోరుగా సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. తన పీఆర్ టీమ్ ఇక్కడా చురుకుగా పని చేస్తుందని తెలిసింది. మరోవైపు మేనేజర్లు నిర్విరామంగా కొత్త అవకాశాల వేటలో బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది.ఒకవైపు మలయాళ చిత్రాల్లో నటిస్తూనే మరోవైపు టాలీవుడ్‌లోనూ టాప్ మేకర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది మమిత. -ప్రేములు- సక్సెస్ ఇచ్చిన జోరును కంటిన్యూ చేస్తూ తెలుగులోనూ బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ఆఫర్లను సొంతం చేసుకుంటోంది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ఆస్కారం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ సౌత్ ఇండస్ట్రీలో ప్రత్యేకమైన మార్కెట్‌ను క్రియేట్ చేసుకుంటోంది.మమితా బైజు కమిట్ అవుతోన్న చిత్రాల ప్రచార సరళిని చూస్తే? రాబోయే రోజుల్లో టాలీవుడ్‌లో మలయాళ భామ హవా మరింత జోరుగా సాగడం ఖాయమనిపిస్తోంది. కంటెంట్ ఓరియెంటెడ్ పాత్రలతో పాటు, స్టార్ హీరోల సరసన పాన్-ఇండియా స్థాయి ప్రాజెక్ట్‌లను దక్కించుకుంటూ దూసుకెళ్తున్న తీరు యువ నటీమణులకు స్ఫూర్తిగా నిలుస్తుంది.



బోల్డ్ లెదర్ అథ్లీజర్ స్ట్రీట్‌వేర్ లుక్‌లో నోరా ఫతేహి మెరుపులు

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com